RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 162 మంగళవారం 8 జూలై 2025 పేజీలు : 4

## 23.30 లక్షలు చెల్లిస్తే గోల్డెన్ వీసా

దుబాయి : భారతీయులకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇస్తోంది. కొత్త రకం గోల్డెన్ వీసాను అందిస్తోంది. స్థిరాస్థి లేదా వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండా ఈ వీసాను పొందే అవకాశం కల్పిస్తోంది. నామినేషన్ ప్రాతిపదికన ఈ వీసాను ఇస్తోంది. ఇప్పటి వరకు దుబాయ్ గోల్డెన్ వీసాను భారతీయులు పొందడానికిగాను కనీసం రెండు మిలియన్ ఏఈడీల (రూ.4.66 కోట్లు) విలువైన ప్రాపర్టీలో పెట్టుబడి పెట్టాలి లేదా దేశంలోని వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఒక మార్గంగా ఉంది. అయితే ఇప్పుడు కొత్తగా నామినేషన్ ఆధారిత వీసా విధానం కింద భారతీ యులు లక్ష ఏఈడీలు (దాదాపు రూ.23.30 లక్షలు) రుసుముగా చెల్లిస్తే జీవిత కాలానికి యూఏఈ గోల్డెన్ వీసా పొందవచ్చు.




## ఘోర ప్రమాదం.. నలుగురు సజీవ దహనం

వాషింగ్టన్, జులై 07: అమెరికాలో హైదరాబాద్‌కు చెందిన ఒక కుటుంబం సజీవ దహనమైంది. వెకేషన్ కోసం డల్లాస్‌కు వెళ్లిన కుటుంబం.. గ్రీన్ కౌంటీ వద్ద కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దంపతులు తేజస్విని, శ్రీవెంకట్‌తోపాటు వారి ఇద్దరు పిల్లలు సజీవ దహనమయ్యారు. అట్లాంటా నుంచి డల్లాస్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శ్రీవెంకట్ వారి స్వస్థలం హైదరాబాద్‌లోని కొంపల్లి. వెకేషన్‌లో భాగంగా వీరు డల్లాస్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. వారం రోజుల సెలవుల అనంతరం వీరు.. అట్లాంటా నుంచి తిరిగి వస్తున్నారు. ఆ క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారుతోపాటు అందులోని నాలుగు మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. గ్రీన్ కౌంటీ ప్రాంతంలో ఈ కారు రాంగ్ రూట్‌లో వచ్చినట్లు తెలుస్తుంది. దీంతో ఎదురుగా వస్తున్న మినీ ట్రక్కు.. ఈ కారును ఢీ కొట్టినట్లు ప్రాథమిక సమాచారం. ఈ కారు రాంగ్ రూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అమెరికా పోలీసులు ఇప్పటికే ఒక నిర్ధారణకు వచ్చారని తెలుస్తుంది. ఈ ప్రమాద ఘటనపై భారత్‌లోని వారి బంధు మిత్రులకు పోలీసులు సమాచారం అందించారు. దీంతో వారంత కన్నీరుమున్నీరు అవుతున్నారు.




హైదరాబాద్, జులై 7: సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇంఛార్జ్‌లను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. ఈరోజు (సోమవారం) జిల్లా ఇంఛార్జ్‌లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, 10 ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి విధానాలను మీనాక్షి వెల్లడించారు. త్వరలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం ఉంటుందని చెప్పారు. వెంటనే రంగంలోకి దిగాలని ఏఐసీసీ ఇంఛార్జ్ ఆదేశాలు జారీ చేశారు.

ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను టీపీసీసీ చీఫ్ నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఉమ్మడి జిల్లా ఇంఛార్జ్‌లను టీపీసీసీ చీఫ్ ప్రకటించారు. **ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్‌లు వీరే...** 1. వంశీచంద్ రెడ్డి - ఖమ్మం 2. ?సంపత్ కుమార్ - నల్లగొండ 3. అడ్లూరి లక్ష్మణ్ - వరంగల్ 4. ?పొన్నం ప్రభాకర్ - మెదక్ 5. జగ్గారెడ్డి - హైదరాబాద్6. కుసుమ కుమార్ - మహబూబ్‌నగర్ 7. అనీల్ యాదవ్ - ఆదిలాబాద్ 8. అద్దంకి దయాకర్ - కరీంనగర్ 9. అజ్మతుల్లా హుస్సేన్ - నిజామాబాద్ 10. శివసేన రెడ్డి - రంగారెడ్డి



## కాళేశ్వరంపై నివేదిక సిద్ధం!.. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి అందజేత

హైదరాబాద్: కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదిక దాదాపు సిద్ధమైంది. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి అందించే అవకాశముంది. విచారణలో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 115 మందిని కమిషన్ ప్రశ్నించి, వాంగ్మూలాలను నమోదు చేసింది. అంతేకాకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలను కూడా క్రోడీకరించి పూర్తి నివేదికను సిద్ధం చేసి.. ఈ నెలాఖరు కల్లా ప్రభుత్వానికి అందించనుంది.

# ఆడ బిడ్డలను అండగా నిలబడే ప్రభుత్వం మాది!




## తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారు

## 'మహిళలకు 60 సీట్లు ఇచ్చే బాధ్యత నాదే' : సీఎం రేవంత్

హైదరాబాద్: ప్రకృతిని మనం కాపాడితేనే.. ప్రకృతి మనల్ని కాపాడుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'వనమే మనం... మనమే వనం' అని పెద్దలు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పుకొచ్చారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో ఓ మొక్కను నాటాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మీ పిల్లల్లాగే వాటిని సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని ఉద్ఘాటించారు. ఇవాళ(సోమవారం) ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వనమహోత్సవం- 2025 కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్సవాన్ని సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వేం నరేందర్ రెడ్డి. పీసీసీఎఫ్ డా. సువర్ణ, ఇతర అటవీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం అటవీ శాఖ HMDA ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మహిళలను ప్రోత్సహిస్తూ తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని గుర్తుచేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదని.. ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని వెల్లడించారు. తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారని చెప్పుకొచ్చారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను చూసి మిస్‌వరల్డ్ పోటీదారులు అభినందించారని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో వెయ్యి బస్సులకు మహిళలు యజమానులు అయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. హై టెక్ సిటీ పక్కన మహిళా శక్తి భవన్ నిర్మించామని గుర్తుచేశారు. ఐకేపీ సెంటర్ల ద్వారానే వడ్లు కొనుగోలు జరుగుతోందని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆడబిడ్డలను పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల వరకు మంత్రివర్గంలో మహిళలు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ తెచ్చిందే కాంగ్రెస్ అని ఉద్ఘాటించారు. త్వరలోనే చట్టసభల్లో కూడా మహిళలకు 33శాతం రిజర్వేషన్ రాబోతుందని ప్రకటించారు. 51 అసెంబ్లీ స్థానాలు మహిళలకు రిజర్వ్ కానున్నాయని చెప్పుకొచ్చారు. 51కి మరో పది కలిపి మహిళలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి....** సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటించనున్నారు. రెండు రోజుల పాటు ముఖ్యమంత్రి ఢిల్లీలోనే ఉండనున్నారు. పలువురు కేంద్రమంత్రులను కలవనున్నారు. మధ్యాహ్నం 2.30కి



కేంద్ర క్రీడలు, కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. తెలంగాణ రాష్టానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సీఎం చర్చించనున్నారు. కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి మాట్లాడనున్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. రాష్ట్రానికి యూరియా కోటా పెంచాలని కోరనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. అలాగే బనకచర్ల అంశంపై మరోసారి కేంద్రమంత్రిని కలిసి చర్చించనున్నారు. ఇప్పటికే బనకచర్ల అనుమతులని పర్యావరణ కమిటీ నిరాకరించింది. మరోసారి బనకచర్ల ప్రాజెక్ట్‌ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న నిధులపై కేంద్రమంత్రులను కలవనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో నిధుల ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచనున్నారు. 42 శాతం రిజర్వేషన్ ఆమోదంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సీఎం చర్చించనున్నారు. విభజన సమస్యల పరిష్కారానికి ఢిల్లీ పెద్దలతో భేటీ కానున్నారు సీఎం రేవంత్‌రెడ్డి.




# వదినమ్మ కోసం...

## చంద్రబాబు 'చక్రం' తిప్పుతారా!?

అమరావతి : రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని అంటారు. అలానే.. చంద్రబాబు కుటుంబానికి.. దగ్గుబాటి కుటుంబానికి మధ్య రాజకీయ వైరుధ్యాలు ఒకప్పుడు ఉన్నా.. ఇప్పుడు దాదాపు సమసిపోయా యన్న భావన అయితే ఉంది. ఒకప్పుడు ఆ ఇంటిపై కాకి.. ఈ ఇంటిపై వాలని విధంగా రాజకీయాలు చేసుకున్నారు. పరస్పర వైరుధ్యంగా రాజకీయాలు చేసుకున్నారు. కానీ, గత కొన్నాళ్లుగా ఈ రెండు కుటుంబాలు కలిసిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షురాలు రేసులో ఉన్నారని భావిస్తున్న రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విషయంలో చంద్రబాబు చక్రం తిప్పుతారా? అనే చర్చ తెరమీదికి వచ్చింది. ప్రస్తుతం ఈ విషయం కూటమి పార్టీల్లోనూ చర్చగా మారింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడుగాఉన్న జేపీ నడ్డా .. ఈ నెల ఆఖరులో ఆ పదవిని వదులుకోనున్నారు. ప్రస్తుతం దేశంలోని 19 రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షులను మారుస్తోంది. వీరి ఎంపిక పూర్తయిన దరిమిలా వెంటనే జాతీయ నాయకత్వంపై దృష్టి పెట్టనుంది. ఈ దఫా దక్షిణాది నుంచి జాతీయ అధ్యక్ష పదవికి నాయకులను ఎంపిక చేయాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. ఉత్తరాదిలో ఓటు బ్యాంకు తగ్గుతున్న నేపథ్యంలో బీజేపీ దక్షిణాదిపై ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. పైగా.. దక్షిణాదిలోనూ ఎక్కువ మంది మిత్రులు ఉన్నారు. ఈ క్రమంలోనే దక్షిణాదికి చెందిన వారిని పార్టీ చీఫ్‌లుగా తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే దగ్గుబాటి పురందేశ్వరి, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, వానతి శ్రీనివాసన్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఎక్కువగా అవకాశం దగ్గుబాటికే ఉందన్న చర్చ కూడా ఉంది. దీనికి కారణం.. కూటమిలో మిత్ర పక్షంగా ఉన్న టీడీపీ అధినేత చక్రం తిప్పే అవకాశంఉందని సమాచారం. వాస్తవానికి బీజేపీ వ్యవహారమే అయినా.. చంద్రబాబు చెబితే.. కేంద్రంలోని వారు కూడా వింటారన్న వాదన ఉంది. గతంలోనూ రెండు మూడు సార్లుఇలానే జరిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు చిన్నమ్మకు కూడా.. చంద్రబాబు చక్రం తిప్పే అవకాశం లేకపోలేదని.. కొందరు అభిప్రాయపడుతున్నారు. ఆమెకు కూడా బీజేపీలో మంచి పలుకుబడి ఉండడం.. ఏపీలో కూటమి కట్టడంలోనూ.. అధికారంలోకి తీసుకురావడంలోనూ కీలకం గా వ్యవహరించిన నేపథ్యంలో బీజేపీ సంతృప్తిగానే ఉంది. సో.. ఈ పరిణామాలన్నీ కలిసి వచ్చి.. పురందేశ్వరికి పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# సంపాదకీయం

## అన్నదమ్ములు ఉన్న దమ్ములు చూపిస్తారా ?

శివసేనను చూస్తే బెబ్బులిని చూసినట్లే. ఆ పార్టీ అధినేత బాలథాక్రే సామాన్యుడు కారు. ఏకంగా కార్టూనిస్టు నుంచి పొలిటికల్ ట్విస్టులు ఇచ్చే బిగ్ షాట్ గా ఎదిగారు. ఆయన 1966లో శివసేనను స్థాపించారు ఇప్పటికి ఆరు దశాబ్దాల చరిత్ర ఆ పార్టీకి ఉంది. ఆయన 2012లో మరణించేంతవరకు శివసేనను తన అదుపు ఆజ్ఞలలో ఉంచారు. అంతే కాదు బీజేపీతో సఖ్యత నెరిపారు. బీజేపీ పెద్దలు సైతం దేశంలో పొత్తులు ఎక్కడ ఎలా ఉన్నా మహారాష్ట్రలో మాత్రం బాల్ థాక్రేని వదిలేశేవారు. అలా అప్పర్ హ్యాండ్ శివసేనదే అయ్యేది. అది కాస్తా కుమారుడు ఉద్ధవ్ థాక్రే నాయకత్వం అనేసరికి బీజేపీకి కొంత అలుసు వచ్చిందని అంటారు. అంతే కాదు తమదే పైచేయి అని చాటుకుంది 2014లో చూస్తే ఎక్కువ సీట్లు డిమాండ్ చేసి శివసేనను దూరం చేసింది. ఒంటరిగా పోటీ చేసి విజయం సాధించింది. ఇక 2019లో శివసేనతో పొత్తులు ఉన్నా సీఎం గా తొలి చాన్స్ తనకే కావాలని కోరింది. దాంతో శివసేన ఏకంగా ఎన్డీయే నుంచి బయటకు వెళ్లిపోయింది. ఇక 2022లో శివసేననే చీల్చేసి బీజేపీ ఎన్డీయే ప్రభుత్వం మహారాష్ట్రలో ఏర్పాటు చేసింది. ఇక 2024లో మరోసారి ఎన్డీయే గెలిచింది. దాంతో ఉద్ధవ్ థాక్రే శివసేన చీలిపోయి ఓడిపోయి నానా ఇబ్బందులు పడుతోంది. ఆరు దశాబ్దాల చరిత్ర ఉన్న శివసేనకు ఎన్నడూ లేని కష్టాలు వచ్చి ఉనికికే ప్రమాదం దాపురిస్తోంది. దాంతో పాటు బీజేపీ దూకుడు సైతం శివసేనను చికాకు పెడుతోంది. మాస్ లీడర్ అనదగిన ఏక్ నాథ్ షిండే ఎన్డీయేలో ఉంటూ ఉద్ధవ్ థాక్రేకి పెను సవాల్ విసురుతున్నారు. ఈ మొత్తం పరిణామాలతో కలవరపడుతున్న ఉద్ధవ్ థాక్రే ఇపుడు తెలివిగా పావులు కదిపారు. తన తమ్ముడు కజిన్ అయిన రాజ్ థాక్రేతో అనుబంధం కలిపారు. నిజానికి చూస్తే ఉద్ధవ్ థాకరేతో విభేదాల కారణంగా శివసేన పార్టీని విడిచిపెట్టిన తర్వాత రాజ్ థాకరే 2006 లో నవ నిర్మాణ్ సేనను స్థాపించారు. చిత్రమేంటి అంటే ఆయన ఒక్కసారి కూడా ఎమ్మెల్యే కానీ ఎంపీగా కానీ ఈ పార్టీ తరపున గెలవలేకపోయారు. దాంతో పాటుగా ఆయన రాజకీయం కూడా అలాగే ఉంది. దాంతో ఇపుడు అన్న ఉద్ధవ్ థాక్రే పిలవగానే కలిసిపోయారు. ఈ ఇద్దరూ కలసి ముంబై వేదికగా కనిపించడం మహారాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం రేపింది. రెండు దశాబ్దాల క్రితం విడిపోయిన అన్న దమ్ములను కలిపింది మాత్రం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అని శివసేన నుంచి సెటైర్లు వినిపిస్తున్నాయి. ఫడ్నవీస్ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మహారాష్ట్రలో హిందీని మూడో భాషగా అమలు చేయాలని నిర్ణయించింది. అయితే దాని మీద పెద్ద ఎత్తున విపక్షాల నుంచి విమర్శలు రావటంతో త్రిభాషా విధానం అమలు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని భావిస్తోంది. అయితే మరాఠా రాష్ట్రంలో హిందీని ఎలా రుద్దుతారు అని థాక్రే బ్రదర్స్ హూంకరించారు. అలా కొన్ని రోజుల క్రితమే తామిద్దరం ఒక్కటిగా దీనిని అడ్డుకుంటామని ప్రకటించారు. ఇపుడు ఈ ఇద్దరూ కలుసుకున్నారు. దీని మీద ఉద్ధవ్ థాక్రే సభలో మాట్లాడుతూ తాము కలిసే వచ్చామని భవిష్యత్తులోనూ కలిసే ఉంటామని చెప్పడం విశేషం. ఎండీయే ప్రభుత్వం మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ప్రతిపక్షాల విజయమంటూ ముంబయిలో వాయిస్ ఆఫ్ మరాఠీ కార్యక్రమం థాక్రే బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరు కావడంతో శివసేన షైనింగ్ అన్న నినాదాలు వినిపిస్తున్నాయి. అన్న దమ్ములు ఇద్దరూ కలిస్తే మహారాష్ట్ర రాజకీయమే మారిపోతుందని శివసేనలో అంటున్నారు. మరో వైపు చూస్తే శివసేన యూబీటీ, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఇకపై కలిసే ఎన్నికల్లో పోటీ చేస్తాయా అన్న చర్చ సాగుతోంది. స్థానిక ఎన్నికలతో మొదలెట్టి సార్వత్రిక ఎన్నికల దాకా ఈ బంధాన్ని తీసుకుని పోతారని అంటున్నారు. అన్నదమ్ములు ఇద్దరూ కలిసారు, ఉన్నదమ్ములు చూపిస్తారు అని అంటున్నారు.

# యువకుడు ఆత్మహత్య



శామీర్ పేట, (గరుడ వార్త) : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శామీర్ పేట కు చెందిన బొసాల నరసింహ(26) వృత్తి రిత్య డ్రైవర్. పూజతో నరసింహకు ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. భార్య ప్రస్తుతం గర్భవతి. వృత్తి పరంగా నరసింహ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లగా, అతని భార్య అమీర్‌పేట్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. నరసింహ ఈనెల 6న ఇంటికి వచ్చాడు. వెంటనే భార్యను ఇంటికి రావాలని ఫోన్ చేసి పిలువగా అతని భార్య నువ్వు మద్యం సేవించడం మానితే వస్తాను అనడంతో ఇద్దరి మధ్యలో వాగ్వివాదం చోటు చేసుకోగా నరసింహ ఫోన్ కాల్ కి స్పందించలేదు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఆమె అల్లుడు తిమ్మయ్య అతని ఇంటికి వెళ్లి చూసినప్పుడు తలుపులు లోపల నుంచి తాళం వేసి ఉండటం గమనించాడు. వెంటిలేటర్ నుంచి చూడగా నరసింహ ఉరివేసుకున్నట్లు కనిపించడంతో తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లగా అతను అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు కుటుంబ కలహాలతో మృతి చెంది ఉండవచ్చు అని భావిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బాధ్యతే కాదు మానవత్వం సైతం చాటుకున్న ఆర్టీసీ బస్సు కండక్టర్

శామీర్ పేట, (గరుడ వార్త) : ఓ ఆర్టీసీ బస్ కండక్టర్ బాధ్యతే కాదు మానవత్వం సైతం చాటుకున్న సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సులో మహిళ హ్యాండ్ బ్యాగ్ మర్చిపోగా కండక్టర్ మానవత్వంతో అందజేశారు. అలియాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ మేడ్చల్ డిపో కి చెందిన యాదగిరిగుట్ట సర్వీస్ నెంబర్ 587 బస్సులో తన హ్యాండ్ బ్యాగ్ మర్చిపోయి అలియాబాద్ గ్రామంలో దిగిపోయింది. బ్యాగు గుర్తుకు వచ్చిన మహిళ వెంటనే మేడ్చల్ డిపో కి ఫిర్యాదు చేశారు. దీంతో డిపోకు చెందిన సిబ్బంది కండక్టర్ కు సమాచారం ఇచ్చారు. మేడ్చల్ నుంచి యాదగిరిగుట్ట వెళ్లే బస్సు కండక్టర్ మహిళా కు చెందిన హ్యాండ్ బ్యాగ్ ను మూడు చింతలపల్లి మున్సిపల్ ఉద్దమర్రి గ్రామంలో శామీర్ పేట ఉమ్మడి మండల ప్రజా కలం రిపోర్టర్ మధుసూదన్ రెడ్డికి అందచేశారు. ఆయన తీసుకొని బాధితులకు బ్యాగును అందజేశారు. బస్ కండక్టర్ మానవత్వం చాటుకున్నాడని పలువురు అభినందించారు.



# కడసారి వీడ్కోలుకూ కన్నీటి కష్టాలే



కరీంనగర్ : జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ పరిధిలో శ్మశాన వాటికల్లో కనీస వసతులు కరవయ్యాయి. కడసారి వీడ్కోలు పలుకుదామని వచ్చిన వారికి నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా వాటిని అభివృద్ధి చేయడంలేదు. ఉన్న వాటిలో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు అంచనాలు, ప్రతిపాదనలకు తగ్గట్లు లేకపోవడం.. అసంపూర్తి పనులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తుది దశలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

**పూర్తయ్యేదెన్నడు?**

శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లే చేసి తుది దశలో ఆపేశారు. నిధుల కొరత, బిల్లుల చెల్లింపులో ఏర్పడిన జాప్యంతో గుత్తేదారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోగా, అధికారులు సైతం పట్టనట్లుగా ఉంటున్నారు. ప్రధానగంగా కారా?నగడ్డ, కిసాన్‌నగర్ బీట్ మార్కెట్‌లో ఉన్న విద్యుత్తు సరఫరా లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. స్తంభాలు ఉన్నా.. వీటికి నియంత్రిక దగ్గర నుంచి కనెక్షన్ తీసుకోవడంలేదు. గతంలో ఉన్న కనెక్షన్ తొలగించారు. నీళ్ల వసతి అసలే లేదు. స్నానాల గద%రి%్నలకు తాళాలు ఉంటున్నాయి. బోర్‌వెల్ ఉన్నా పని చేయడంలేదు. ఆదర్శనగర్‌లో బోరింగ్ ఉంది. మీటర్ లేకపోవడంతో అయిదేళ్లుగా శ్మశానవాటికకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. సవారన్ వీధిలో ఉన్న వైకుంఠధామం పరిస్థితి అలాగే ఉంది. సమాధుల్లో వీధిదీపాలు వెలగడంలేదు.

**నిధులు కేటాయించినా పనులేవీ?**

నగరవ్యాప్తంగా 22 వైకుంఠధామాలు ఉండగా వీటికి పలు రకాల నిధులు కేటాయించారు. ఇందులో 13 చోట్ల అభివృద్ధికి అయిదేళ్ల కిందట సీఎంఏ, పట్టణ ప్రగతి, సాధారణ, సీడీపీ, ఎస్సీ సబ్‌ప్లాన్, ఆర్థిక సంఘం కింద రూ. 12.37 కోట్లు కేటాయించారు. వీటితోపాటు ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ మైనార్టీల శ్మశాన వాటికలకు తగిన ప్రాధాన్యం ఇచ్చారు. నిధులు కేటాయించినా ఆ పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. అలకాపురి, మార్కండేయనగర్, మానేరు వాగులో కొంతమేర బాగున్నా మిగతా వాటిల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

**ట్యాంకర్లే దిక్కు**

హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు పూర్తయిన తర్వాత స్నానాలు చేయాల్సి ఉంటుంది. స్నానాల గదులు ఉన్నా వినియోగంలోకి తీసుకురావడంలేదు. అందులో నీటివసతి, వీధిదీపాలు లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ట్యాంకర్ల దగ్గర నిలబడి స్నానాలు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నగర పాలక అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించేలా చొరవ చూపాలని నగరవాసులు కోరుతున్నారు.

# షరామామూలు.. ఫిర్యాదులొస్తే చర్యలు

పెద్దపల్లి: అనుమతించిన దాని కంటే అధిక పరిమాణంలో మట్టి తరలించడంపై ఫిర్యాదులు రావడంతో పంట పొలాల్లో నిల్వ చేసిన అక్రమార్కులు.. ఆ మట్టిని తాజాగా బట్టీలకు తరలించడం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. మైనింగ్ అధికారులు కొందరికి అనుకూలంగా, మరికొందరికి ప్రతికూలంగా వ్యవహరిస్తుం డటంతోనే దందా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో 2023లో ఇటుక బట్టీల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తారన్న భయంతో యజమానులు పంట పొలాల్లో భారీ మొత్తంలో మట్టిని నిల్వ చేశారు. రాఘవాపూర్ సమీపంలోనూ లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఉంచారు. అలా నిల్వ చేసిన మట్టిని వారం రోజులుగా బట్టీలకు తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

**నిద్ర మత్తులో గనుల శాఖ**

జిల్లాలో మట్టి రవాణాతో పాటు, ఇసుక అక్రమ తరలింపుపై భూగర్భ గనుల శాఖ అధికారులు ఆది నుంచీ తప్పించుకునే మార్గాలనే అన్వేషిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఫిర్యాదులు చేయడం, కోర్టులను ఆశ్రయిస్తేనే సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గతంలో మానేరు నుంచి ఇసుక రవాణాపై గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలు వచ్చేవరకు మైనింగ్ అధికారులు స్పందించలేదు. చెరువుల మట్టి తవ్వకాలపైనా నీటిపారు దల శాఖపైనే భారం వేస్తున్నారు. గుర్తించిన చెరువులెన్ని? ఎంత లోతు నుంచి మట్టి తీస్తున్నారు? అనుమతించిన పరిమాణం ఎంత? ఎంత తరలిస్తున్నారు? వంటి కనీస అంశాలపైనా తనిఖీలు చేయకుండానే ఫిర్యాదులను పక్కన పెట్టడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటే తప్ప జిల్లా అధికారుల్లో మార్పు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.



**అక్కడ అలా.. ఇక్కడ ఇలా..**

పెద్దపల్లి మండలం కొత్తపల్లి చెరువు నుంచి మట్టిని అధిక పరిమాణంలో తరలించడంపై గతంలో కొందరు ఫిర్యాదు చేయడంతో అక్కడి పంట పొలాల్లోనే నిల్వ చేశారు. ఈ ఏడాది మార్చిలో నిల్వ చేసిన మట్టిని బట్టీలకు తరలించే క్రమంలో సదరు ఫిర్యాదుదారుడు స్థానిక అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించిన మైనింగ్ అధికారులు సదు మట్టి కుప్పలను సర్వే చేసి, రవాణాదారులకు రూ. 2.31 కోట్ల జరిమానా విధించారు. తాజాగా రాఘవాపూర్ శివారు లో నిల్వ చేసిన మట్టిని తరలించడంపై అధికారులు కనీస విచారణ కూడా చేపట్టడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసి, వెంటపడితే తప్ప విచారణ చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం తరలించే మట్టికి రాయల్టీ చెల్లించారా..! గతంలో ఎంత చెల్లించారు..! ఎంత నిల్వ చేశారు..! అనే అంశాలపై కనీస సర్వేలు కరవయ్యాయి.

# హెచ్‌ఎండీఏలో పరిపాలన జోన్లు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)ను త్వరలో పరిపాలన సౌలభ్యం కోసం వికేంద్రీకరణ చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధి ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. త్వరలో మరో 3 వేల కి.మీ.ల మేరకు పెరగనుంది. ప్రాంతీయ రింగ్‌రోడ్డు దాటిన తర్వాత 2 కి.మీ.ల వరకు హెచ్ఎండీఏ గ్రోత్ కారిడార్ కింద రానుంది. అక్కడి వరకు ప్లానింగ్, ఇంజినీరింగ్ ఇతర కార్యకలాపాలన్నీ హెచ్ఎండీఏ పరిధిలోకి రానున్నాయి. ఇప్పటివరకు బల్దియా మాదిరి ప్రత్యేక జోనింగ్ వ్యవస్థ లేదు. కేవలం ప్లానింగ్ విభాగాన్ని మాత్రమే ఆరు జోన్లుగా విభజించారు. ఏడు జిల్లాల పరిధిలో లేఅవుట్లు, నిర్మాణాల కోసం హెచ్ఎండీఏను ఆశ్రయించాల్సి వస్తోంది. సంగారెడ్డి, యాదాద్రి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు రావాలి. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నది. పెరిగిన పరిధి చూస్తే ఇప్పుడున్న సిబ్బందికి రెండింతలు అదనంగా అవసరం. దీంతో వికేంద్రీకరణకు యోచిస్తున్నారు.

**జోన్ స్థాయిలోనే పనులు...**

ప్రస్తుతం ప్రణాళిక విభాగంలో ఆరు జోన్లు ఉన్నాయి. సిబ్బంది, అధికారులు నగరం నుంచే సేవలు అందిస్తున్నారు. పరిపాలన జోన్లు ఏర్పాటైతే క్షేత్రస్థాయి నుంచి మొత్తం విభాగాలు పని చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ప్రతి జోన్‌కు కమిషనర్, ప్లానింగ్ అధికారులు, సీఈ, ఎస్ఈలు ఉంటారు. జోన్ స్థాయిలోనే పనులు పూర్తి చేస్తారు. రానున్న మెగా మాస్టర్ ప్లాన్‌తోపాటు పరిపాలన వికేంద్రీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతంహెచ్ఎండీఏ విస్తీర్ణం: 7,257 చ.కి.మీ.లు
విస్తరించనున్న పరిధి: 10,472.72 చ.కి.మీ.లు
ప్రస్తుతం ఉన్న జిల్లాలు: 07
కొత్త వాటితో కలిపి: 11
మొత్తం మండలాలు: 104
మొత్తం గ్రామాలు: 1355

# అవకాశాల అక్షయపాత్ర

పెద్దపల్లి : సెల్‌ఫోన్, టీవీ, కంప్యూటర్ ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరుగుతోంది. వీటి తయారీలో కీలకమైన సెమీకండక్టర్ రంగంలో అవసరాలకు సరిపడా ఉత్పత్తి లేక ఇండియా ఇతర దేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఈ రంగం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుండగా.. నైపుణ్యం, పెట్టుబడులు, మౌలిక వసతులు కల్పిస్తే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించనున్నాయి.

**వచ్చే ఏడాది గణనీయ ఉత్పత్తి**

మన దేశంలో సెమీకండక్టర్ల రంగంలో 2021 నాటికి 9 శాతం మాత్రమే దేశీయంగా ఎలక్ట్రానిక్ పరికరాలు ఉత్పత్తి అవుతున్నాయి. 2026 నాటికి 17 శాతం పెంచేలా కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. పెద్దస్థాయిలో చిప్స్ తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తోంది. గుజరాత్‌లో 2, అసోంలో ఒక పరిశ్రమ స్థాపనకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ 2029 నాటికి చిప్స్ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

**సన్నద్ధత ఇలా..**దేశీయ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం ఇస్రో, డీఆర్డీవో, బీఈఎల్, ఎస్ఈఎల్ పరిశోధనా సంస్థలు ఆధునిక పరికరాలపై అధ్యయనం

డీఎల్ఐ పథకంలో దేశీయ సంస్థలకు స్టార్టప్‌లో ఆర్థిక సహకారం ఎలక్ట్రానిక్ చిప్స్ ఎగుమతులకు డిమాండ్ పెరిగేలా చర్యలు తీసుకోవడం.మార్కెట్ అవసరాలు, ఉపాధి రంగాల్లో ప్రతిభ చాటేందుకు సన్నద్ధం చేయడం

ఇదే మంచి తరుణం

ఇంజినీరింగ్, కెమికల్స్ సైన్స్ ఎలక్ట్రానిక్ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులకు భవిష్యతులో మంచి అవకాశాలు రానున్నాయి. విద్యార్థులు ఎలక్ట్రానిక్ బ్రాంచ్‌లను ఎన్నుకుంటే చదువు పూర్తయ్యేవరకు



సెమీకండక్టర్ డిజైన్, తయారీ, టెస్టింగ్ రంగాల్లో పట్టు సాధించవచ్చు దేశంలో వచ్చే పదేళ్లలో ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయి. ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంతంగా ఉత్పత్తులు తయారు చేసుకునే అవకాశం లభించనుంది.

**ఇవీ లోపాలు**

సరైన నైపుణ్యం, శిక్షణ శ్రామికుల కొరత
ఇంజినీరింగ్ యువత లోతైన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోకపోవడం
నూతన టెక్నాలజీ అభివృద్ధిలో అధిక మూలధన పెట్టుబడుల కొరత
భవిష్యత్తులో మెరుగైన ఉపాధి

ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో సెమీ కండక్టర్ రంగం కీలకం. సరైన నైపుణ్యాలు, శిక్షణ అవకాశాలను అందిపుచ్చుకుంటే ప్రతిభ మెరుగవుతుంది. ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులు ఉపాధి అవకాశాలు లభించే బ్రాంచ్‌లను ఎన్నుకోవాలి. సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించడంతో భారీగా ఉపాధి పెరగనుంది. రమేశ్, ప్రొఫెసర్(ఈసీఈ), హుజూరాబాద్

**ఉపాధి కోర్సులను ఎన్నుకోవాలి**సెమీకండక్టర్ల తయారీలో పురోగతి సాధిస్తున్నాం. ఆధునిక డిజైన్లను తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పరిశోధనా సంస్థలు సహకారం అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వస్తువులకు అవసరమైన చిప్స్ కొనుక్కునే పరిస్థితి ఉండదు. శ్రీనివాస్, ప్రొఫెసర్(ఈసీఈ) పెద్దపల్లి

## దారి అందంగా మారేలా..

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన హెచ్ఏఎం(హైబ్రిడ్ యాన్యుటీ మోడ్) పథకంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారులను ఉన్నతీకరించనున్నారు. ఇప్పటికే ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థ సర్వే పూర్తి చేసి డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 187 రోడ్లు 612 కి.మీ. పొడవున ఉన్నతీకరించనున్నారు. ఒక వరుస రహదారులను రెండు వరుసలుగా విస్తరిస్తారు. కంకర రోడ్లుంటే తారు రోడ్లుగా మారుస్తారు. ఖమ్మం పీఆర్ సర్కిల్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉండగా అన్ని రహదారులను ఒకే ప్యాకేజీగా నిర్ణయించారు. నెల రోజుల్లో టెండర్లు ఆహ్వానించనున్నారు. కి.మీ.కు సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో టెండర్లు నిర్వహిస్తారని తెలుస్తోంది. 612 కి.మీ. రోడ్ల విస్తరణకు రూ.612 కోట్లు వెచ్చించనున్నారు. రెండో దశలో 121 రోడ్లు 346 కి.మీ., మూడో దశలో 134 రోడ్లు 383.19 కి.మీ. పొడవున రోడ్లను ప్రతిపాదించారు. ప్రస్తుతం మొదటి దశలో ప్రతిపాదించిన రహదారులను ఉన్నతీకరిస్తారు. రహదారులు,భవనాలశాఖ పరిధిలో మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, మండల కేంద్రం నుంచి మండల కేంద్రానికి, గ్రామం నుంచి మండల కేంద్రానికి రహదారులను విస్తరించనున్నారు.



మూడు విభాగాల్లో ఇప్పుడున్న రహదారులను రెండు, నాలుగు వరుసలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఖమ్మం జిల్లాలో 34 రహదారులను 376.90 కి.మీ. పొడవున అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులకు త్వరలో టెండర్లు నిర్వహించనున్నారు.

**మూడు దశల్లో పీఆర్ రోడ్లు అభివృద్ధి**

ఉభయ జిల్లాల్లో హెచ్ఏఎం పథకంలో పీఆర్ రోడ్లను మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను సర్కారుకు సమర్పించాం. మొదటి దశలో 612 కి.మీ. అప్‌గ్రేడ్ చేస్తాం. ఈ పథకంలో పీఆర్ రోడ్లు ఒకేసారి అభివృద్ధికి నోచుకుంటాయి.- గుర్రాల వెంకటరెడ్డి, పీఆర్ ఎస్ఈ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

## కాంగ్రెస్ నేతలు.. కలవని చేతులు

కరీంనగర్ : కరీంనగర్ కాంగి'రేసు'లో ఎవరికి వారే అనే విధంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఇంకా పార్టీలో విభేదాలు సమసిపోవడం లేదు. ఓ వైపు పార్టీ అధిష్ఠానం కలిసికట్టుగా ముందుకు సాగాలనే సంకేతాలిస్తుంటే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం ఇందుకు భిన్నంగా నాయకులు తమ పట్టుని నిలబెట్టుకునే ప్రయత్నంలో వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు. ప్రత్యేక సమావేశాల నిర్వహణతోపాటు పార్టీ కార్యక్రమాల్లోనూ ఎవరికి వారూ పై'చేయి' చాటే ప్రయత్నం చేస్తున్నారు.నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు గతంలో ఎన్నడూ లేని విధంగా తమ నాయకుల వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎటువైపున ఉంటే ఏమి కష్టమొస్తుందనే భయంతో ఎటూ తేల్చుకోలేక ఊగిసలాడుతున్నారు. తాజాగా గురువారం కరీంనగర్ కలెక్టరును 15 నిమిషాల వ్యవధిలో రెండు గ్రూపులుగా నాయకులు కలిసి వినతిపత్రాలు ఇవ్వడం రాజకీయంగా మరోసారి చర్చనీయాంశంగా మారింది. పైకి మాత్రం వేర్వేరు సమస్యలపై కలెక్టరును కలిశామని చెబుతున్నా.. లోలోపల మాత్రం పార్టీలో ఉన్న వర్గపోరు తీరు ఇట్టే బహిర్గతమవుతోంది.

**ఇన్‌ఛార్జి ఊసే లేదు..**

కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నియామకం విషయంలో ఇంకా ఊగిసలాటే ఈ పార్టీలో కనిపిస్తోంది. పార్టీలో రెండు గ్రూపుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతోనే పోటాపోటీ ఫిర్యాదులతో నియోజకవర్గ బాధ్యుడిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ఏడాది మే 6వ తేదీన ఆయనను తప్పించారు. అప్పటి నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎవరికి బాధ్యతలను అప్పగిస్తారనే విషయంలో ఇంకా స్పష్టత రావడంలేదు. కానీ కరీంనగర్‌కు చెందిన కొందరు ముఖ్యనేతలు తమనే ఆ పదవి వరిస్తుందనే ప్రచారాన్ని అనుచరగణం వద్ద బలంగా వినిపిస్తున్నారు. అయితే పార్టీలో ఉన్న కొందరు నాయకులు తమకు పైస్థాయిలో ఉన్న మంత్రులు, ఇతర నాయకుల మద్దతుతోనే 'తగ్గేదేలే' అనే విధంగా జోరును చూపిస్తున్నారు. ఒకరితో తాము కలవడమెందుకని సమావేశాలు, పార్టీ కార్యక్రమాల్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. రెండ్రోజుల కిందట నియోజకవర్గ స్థాయి సమావేశం విషయంలోనూ ఈ పొరపచ్చలు కనిపించాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే హైదరాబాద్‌లో పాల్గొనే బహిరంగ సభకు జనాలను తరలించేందుకుగానూ ఈ సమావేశాల్ని నిర్వహించారు. ఇందిరాగార్డెన్‌లో ఒక సమావేశాన్ని ఓ నేత సమక్షంలో నిర్వహిస్తే మరుసటి రోజున ఓ హోటల్‌లో మరో నేత ఇంకో సమావేశాన్ని నిర్వహించారు. ఇలా చేతులు కలపకుండానే నాయకులు భిన్నమైన వైఖరిని అవలంబిస్తుండటంతో పార్టీలో ఉన్న ముసలం ఇంకా ముమ్ముదు పార్టీకి తలనొప్పిగానే మారనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించాలంటే నాయకులు కలిసికట్టుగా నడవాల్సిన అవసరముంది.

## గూడుకు కంకర గోడు

కరీంనగర్: పదిహేను రోజుల కిందట ట్రాక్టర్ కంకర రూ.2400- రూ.2700 ధరకు మార్కెట్లో లభించింది. ప్రస్తుతం అనూహ్యంగా ఈ ధరను రూ.3,500లకు పెంచారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లకు కీలకమైన సిమెంట్, కంకర తక్కువ ధరకు అందించాలని అధికారులకు సూచనలిస్తుంటే ఉమ్మడి జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా వ్యాపారులు కంకర ధరను ఇష్టానుసారంగా పెంచేశారు. దీంతో ఇందిరమ్మ లబ్ధిదారులతోపాటు నిర్మాణాలు చేపట్టే వారందరిపైనా తీవ్ర ప్రభావం పడనుంది. 400 చదరపు అడుగుల్లో రూ.5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణానికి స్లాబ్ వేయాలంటే 2 నుంచి 3 ట్రాక్టర్ల 20 ఎం.ఎం. కంకర అవసరమవుతుంది. దీంతోపాటు పునాది దశలో నేలను చదును చేసేందుకు కొందరు 40 ఎం.ఎం. కంకరను వాడుతారు. పిల్లర్లకు వినియోగించేందుకు మరో మూడు ట్రాక్టర్ల వరకు వాడాల్సి ఉంటుంది. మొత్తంగా లబ్ధిదారులు ఒక ఇంటిని పూర్తి చేసేందుకు ఎంతలేదన్నా 8-10 ట్రిప్పులను వినియోగించాలి. దీంతో రూ.28- రూ.35 వేల వరకు దీనికే ఖర్చవనుంది.

అవకాశంగా తీసుకుని..ఉమ్మడి జిల్లాలో 39,806 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. నిర్మాణాలు ఒకేసారి ప్రారంభమవడంతో వ్యాపారులు కంకర ధర పెంపు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడుగా గృహ నిర్మాణ సంస్థ ఇటీవల విడుదల చేసిన నమూనా నిర్మాణ ప్రక్రియలో భాగంగా 400 చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మించే ఇంటికి ఎంతెంత ఖర్చవుతాయనే అంచనాలు ప్రాథమికంగా రూపొందించింది.

## బాబోయ్..బాబోయ్..లింకులు భరించలేం..!



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎరువుల డీలర్లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఉభయ జిల్లాల్లో సుమారు 800 మంది డీలర్లు ఉన్నారు. ఎరువుల కంపెనీలు గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా, డీఏపీలకు అంతులేని లింకులు అంటగట్టి తమను తీవ్ర ఆర్థికపరమైన ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు.

**అంతిమంగా రైతులపైనే భారం**

కంపెనీలు.. యూరియా, డీఏపీలను ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు సరఫరా చేయకుండా లారీ కిరాయిల భారం మోపుతుండటంపై డీలర్లు ఆందోళనకు గురవుతున్నారు. రెండేళ్లుగా అనూహ్యంగా లింకు ఎరువుల పరిమాణాన్ని పెంచుతున్నాయని చెబుతున్నారు. రూ.1.12లక్షల విలువైన యూరియాకు సుమారుగా రూ.6లక్షల కాంప్లెక్స్ ఎరువులు అమ్మాలని లింకు పెడుతున్నారని వాపోతున్నారు. ఇలా అయితేనే యూరియా, డీఏపీని ఇస్తామని కంపెనీలు స్పష్టం చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. కంపెనీలు.. మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ సేవా సంస్థలు, హాకా, మనగ్రోమోర్ కేంద్రాలకు ఏవిధమైన లింకు ఎరువులు ఇవ్వటం లేదని పేర్కొంటున్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు విధిస్తున్న లారీ కిరాయిల భారం అంతిమంగా రైతులపైనే పడుతోందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

**విక్రయాలు నిలిపేయాలని తీర్మానం**

తమ సమస్యల గురించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులకు విన్నవిస్తున్నా పట్టించుకోకపోవటం లేదని డీలర్లు చెబుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఆందోళనకు సిద్ధమవుతున్నామని స్పష్టం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ప్రైవేటు డీలర్లు.. యూరియా, డీఏపీ విక్రయాలను నిలిపివేశారని తెలిపారు. తెలంగాణలోనూ ఈనెల 10లోగా మండల, జిల్లా స్థాయిలో డీలర్లు తమ సలహాలు, సూచనలు, నిర్ణయాలు తెలపాలని రాష్ట్ర అసోసియేషన్ కోరింది. దీనిపై ఖమ్మం జిల్లాలోని వివిధ మండలాల్లో డీలర్లు సమావేశాలు నిర్వహించారు. ఖమ్మం అర్బన్, చింతకాని, తల్లాడ, వైరా తదితర ఎనిమిది మండలాల్లో ఎరువుల అమ్మకాలను నిలిపేయాలని తీర్మానించారు. 'కంపెనీలు లింకు ఎరువులను అంటకట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలి' అని ఎరువుల డీలర్ల అసోసియేషన్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు రామడుగు మనోహర్‌కు తెలిపారు.

## అవగాహన లేక విద్యార్థుల అవస్థలు



ఖమ్మం : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలపై సరైన అవగాహన లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వారికి కష్టాలు ఎదురవుతున్నాయి. ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'ఎప్‌సెట్' కౌన్సెలింగ్ కేంద్రంలో ప్రతీరోజు ఇదో సమస్య తలెత్తుతూనే ఉంది.

**పూర్తిగా స్థానికులకే...**

రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రవేశాల ప్రక్రియ జరిగింది. ఒప్పందం ప్రకారం గత ఏడాదితో పదేళ్ల కాలం పూర్తయింది. ఏపీ విద్యార్థులు నాన్ లోకల్ కోటా కింద తెలంగాణలో 15 శాతం సీట్లు పొందారు. ఇప్పుడు కోటా ఎత్తివేస్తూ నాలుగు నెలల కిందట జీఓ నం.15 జారీ చేశారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులకే ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఏపీలోనూ ఇదే విధానం అమలు చేస్తున్నారు. విషయం తెలియక విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాలకు చెందిన మంది వారి తల్లిదండ్రులతో ఖమ్మం కౌన్సెలింగ్ కేంద్రానికి వస్తున్నారు. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేకపోవటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

**ఈడబ్ల్యూఎస్‌పై గురించి తెలియక..**

ఖమ్మం ఎప్‌సెట్ కేంద్రానికి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, కోదాడ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. కొంతమంది అవసరమైన ధ్రువపత్రాలు తీసుకురావడం లేదు. ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రం విషయంలో పొరబడుతున్నారు. 2025-26కు సంబంధిత తహసీల్దారు ఇచ్చిన సర్టిఫికెట్ మాత్రమే చెల్లుబాటు అవుతుంది. 2024-25లో ఇచ్చినవి తీసుకురావటంతో అధికారులు తిరస్కరిస్తున్నారు. కొన్ని మీసేవా కేంద్రాల్లో విద్యార్థుల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయడం లేదు. క్రీడల్లో ప్రావీణ్యం ఉండి, సర్టిఫికెట్లు ఉన్నా సరిగా నమోదు చేయించుకోవడం లేదు.

**తరచూ మొరాయిస్తున్న సర్వర్...**

ఎప్‌సెట్ మొదలై మూడు రోజులవుతున్నా సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. మూడోరోజు గురువారం సైతం సర్వర్ మొరాయించింది. దీంతో స్థానిక అధికారులు రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గంటల తరబడి సర్వర్లు పని చేయకపోవడంతో ధ్రువపత్రాల పరిశీలనలో జాప్యం నెలకొంటోంది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు రాత్రి దాకా ఇక్కడే ఉండాల్సి వస్తోంది. ఈ విషయమై ఎప్‌సెట్ కోఆర్డినేటర్ సుధాకర్‌ను సంప్రదించగా సర్వర్లు మొరాయిస్తున్న మాట వాస్తవమేనని, తర్వాత సాంకేతిక సమస్యలను పరిష్కరించి కౌన్సెలింగ్‌కు ఇబ్బంది లేకుండా కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

## ప్రణాళిక ప్రకారం పనులు..!



మణుగూరు : నగరపాలిక/పురపాలికల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కొనసాగుతోంది. జనాభా ఎక్కువగా నివసించే పట్టణాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని జూన్ 2న ప్రారంభించింది. వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటోంది. ఒకట్రెండు చోట్ల మినహా మిగతా ప్రాంతాల్లో ప్రణాళిక ప్రకారం పనులు సాగేలా అధికార యంత్రాంగం చొరవ చూపుతోంది.

**చేపడుతున్న కార్యక్రమాలు**

మురుగు, వర్షం నీరు నిలవకుండా చేయటం, తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించటం, భువన్ సర్వే నిర్వహించి ఇంటి పన్ను వర్తించని గృహాలను గుర్తించటం, దోమలు వ్యాపించకుండా చెరువులు, కుంటల్లో ఆయిల్‌బాల్స్, గంబూషియా చేపలు వదలటం, వనమహోత్సవం పేరిట మొక్కలు నాటడం, శ్రమదానం చేయటం, కళాజాత నిర్వహించటం, పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరాలు నిర్వహించటం, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వస్తువులు, వంటకాలను ప్రదర్శించటం, వీరికి బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించటం, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించటం, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించటం వంటి కార్యక్రమాలను అధికారులు చేపడుతున్నారు.

**పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యం**

వంద రోజుల ప్రణాళికలో పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యమిస్తున్నారు. మురుగుకాల్వల్లోని పూడిక, వీధుల్లో చెత్తాచెదారం తొలగిస్తుండటంతో పారిశుద్ధ్యం మెరుగుపడుతోంది. ఇందుకోసం నగరపాలిక/పురపాలిక కార్మికులతో పాటు అదనంగా సిబ్బందిని నియమించుకున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో 53 వార్డులకు 333 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికుల సంఖ్య పెరిగే ఆస్కారముంది. కొన్నిచోట్ల పెద్ద కాల్వలను శుభ్రపరిచి చిన్నచిన్న మురుగుకాల్వలను విస్మరిస్తున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. మణుగూరు పురపాలికలో 20 వార్డులకు 40 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అదనంగా పది మంది కార్మికులను నియమించారు. అయితే రెండు రోజులకు ఒక వార్డును శుభ్రం చేస్తుండటంతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోంది. పురపాలికకు చెందిన 40 మంది కార్మికుల్లో 20 మంది మాత్రమే విధులకు హాజరవుతుండటమే దీనికి కారణం. ఇల్లెందు పురపాలికలోని 24 వార్డుల్లో 120 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. మురుగుకాల్వలను శుభ్రపరుస్తుండటంతో పారిశుద్ధ్యం మెరుగుపడుతోంది.

'100 రోజుల ప్రణాళికలో భాగంగా వార్డుల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. వీటికి సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చుననే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం' అని మణుగూరు పురపాలిక కమిషనర్ ప్రసాదరావుకు తెలిపారు.

## అందని పుస్తకం.. అరకొర అభ్యాసం

కరీంనగర్ : అనాథ, పేద కుటుంబాల బాలికలతోపాటు చదువులను అర్ధాంతరంగా నిలిపేసిన విద్యార్థినులు చదవడానికి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను, ప్రైవేటుకు దీటుగా ఉచిత విద్యాబోధనకు ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటిలో ఇంటర్ కళాశాలల చదువులు ప్రారంభమై నెల రోజులైంది. ఓ వైపు పాఠాలూ బోధిస్తున్నారు. అయినా వారికి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇప్పటికీ అందలేదు. వాటిని ఇంటర్మీడియట్ బోర్డే పంపిణీ చేయాల్సి ఉంది. ఈ విద్యాసంవత్సరం చిగురుమామిడి, తిమ్మాపూర్‌లలోని కేజీబీవీల్లో కొత్తగా ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులను ప్రారంభించారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే అందాల్సిన పాఠ్యపుస్తకాలు ఇప్పటికీ చెంతకు చేరలేదు. ఓ వైపు పాఠ్యాంశాల బోధన ప్రారంభం కావడంతో పుస్తకాలు కరవై విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం ఈ పరిస్థితి లేకపోగా, ఒక్క కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లోని ఇంటర్ విద్యార్థులకు ఈ దుస్థితి ఏమిటనే ప్రశ్న తల్లిదండ్రులు, విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో తరగతులకు హాజరయ్యే వారి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మరో వైపు అధ్యాపకులు కూడా బోధనను ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితి.

కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో అధ్యాపకులు బుక్‌బ్యాంక్‌లలోని పాత పుస్తకాలను విద్యార్థులకు సమకూర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను విద్యార్థులు చదువుకునేలా చేయడంతోపాటు పాతపుస్తకాలను సేకరించి సమకూరుస్తున్నారు. ప్రభుత్వం సత్వరంగా స్పందించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సమకూర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని జీఈసీవో డాక్టర్ డెబోరా కృపారాణి తెలిపారు. త్వరలోనే పాఠ్యపుస్తకాలు వస్తాయని చెప్పారు. అప్పటి వరకు బుక్‌బ్యాంక్‌లోని పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు కేజీబీవీల విద్యార్థినులకు సర్దుబాటు చేస్తున్నారని తెలిపారు.

## శాతవాహన
## విశ్వవిద్యాలయానికి మహర్దశ

కరీంనగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఉపకులపతి ఆచార్య ఉమేశ్‌కుమార్, ఉన్నతాధికారులు పలు మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఏడాది కాలంలోనే వర్సిటీకి రాష్ట్ర సర్కారు వృత్తి విద్యా, న్యాయ విద్య, ఎం.ఫార్మసీ కళాశాలలు మంజూరు చేసింది. 2025-26లోనే తరగతుల నిర్వహణకు, అవసరమైన భవనం, సామగ్రి తదితర వంటివి సమకూర్చుకోవటానికి ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైన నిధులూ మంజూరు చేసింది. బోధన, బోధనేతర సిబ్బందిని సైతం సమకూర్చింది.

**కోర్సుల అనుమతి ఇలా..**

ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, సీఎస్సీ, ఏఐ, ఐటీ, ఈసీఈ, బ్రాంచీలుంటాయి. ఒక్కో దాంట్లో 60 చొప్పున 240 సీట్లు అందుబాటులోకి వస్తాయి. పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కలుపుకొంటే మరో 24 సీట్లు అదనంగా ఉంటాయి. ఈ లెక్కన మొత్తం 264 సీట్లు అవుతాయి. లా కళాశాలలో డిగ్రీ విద్యార్హతపై ప్రవేశం పొందే మూడేళ్ల ఎల్ఎల్‌బీ రెండు సెక్షన్లు మంజూరు చేశారు. ఒక్కో సెక్షన్‌లో 60 చొప్పున 120 సీట్లుంటాయి. వాటికి పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అదనం. వీటిని



లాసెట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాలకు రూ.44.12 కోట్లు, న్యాయ కళాశాలకు రూ.22.96 కోట్లు మంజూరు చేసింది. ఇంజినీరింగ్ కళాశాలకు 87, లా కళాశాలకు 33 పోస్టులను మంజూరు చేసింది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో అధికారులు రెగ్యులర్ కోర్సులకు పది మందిని, ఇతర కోర్సులకు 25 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది.

**న్యాక్ గుర్తింపునకు కృషి**

శాతవాహన విశ్వవిద్యాలయానికి న్యాయ, ఇంజినీరింగ్ కళాశాలలు, ఎం.ఫార్మసీ సాధించాం. ఈ ఏడాది నుంచే ఆయా కళాశాలల్లో కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. విశ్వ విద్యాలయానికి న్యాక్ గుర్తింపు తేవడమే లక్ష్యంగా పని చేస్తాం. సైన్స్ విభాగంలో అధునాతన కోర్సులు తీసుకొస్తాం. వర్సిటీ అనుబంధమైన గోదావరిఖనిలోని పీజీ కళాశాలలో ఎంసీఏ కోర్సును ప్రవేశపెట్టడానికి కృషి చేస్తాం.ఆచార్య యు.ఉమేశ్‌కుమార్, ఉపకులపతి

## ఆరునెలల్లో 22 మంది

గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 22 మంది అవినీతిపరులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు పట్టుబడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నుంచి జూన్ వరకు 126 కేసులు నమోదైతే అందులో ఉమ్మడి జిల్లాలోనే 14 కేసులున్నాయి. చేయితడపందే పనిచేయమన్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. సాధారణంగా చేసే పనులకు కూడా లంచం డిమాండ్ చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఎక్కడ అవకాశం ఉన్నా లంచం రూపంలో డబ్బులు పిండుతున్నారు. ఇందులో రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, పురపాలక, పోలీసు శాఖల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారు.

లంచం తీసుకోవడమెంత నేరమో.. ఇవ్వడం కూడా అంతే నేరమన్న విషయం ప్రచారానికే పరిమితమవుతోంది. అసలు ఇచ్చేవారు లేకుంటే ఆశించే వారుండరు. దానికి మన నుంచే చెక్ పెడితే అవినీతి వ్యవహారాన్ని కట్టడి చేసే అవకాశం ఉంటుంది. అడ్డదారుల్లో పని పూర్తి చేసుకోవాలన్న ఆలోచనతో లంచం ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. కానీ లంచం ఇవ్వడం కూడా నేరమన్న విషయాన్ని గుర్తించడం లేదు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అక్కడున్న పరిస్థితుల ఆధారంగా డిమాండ్ చేస్తున్నారు. పని పూర్తి చేసే అవకాశం ఉన్నా జాప్యం చేస్తున్నారు. దీంతో బాధితులు ఏదో ఒక రాజీకి వచ్చి లంచం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. ఎదుటి వారి బలహీనతలను సొమ్ము చేసుకునే ప్రయత్నంలో లంచావతారులు పెరుగుతున్నారు. దీంతో అవినీతి వ్యవస్థీకృతమవుతోంది.

ఈ ఏడాది జనవరి 15న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ ఆసిఫొద్దీన్, సహాయకుడు రవికుమార్ అనిశా అధికారులకు చిక్కారు. టైటిల్ డీడ్ మార్చేందుకు రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్ రవి ద్వారా రూ.5 వేలు ఇస్తుండగా



అనిశా అధికారులు పట్టుకొని అరెస్టు చేశారు.

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పురపాలక సంఘంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడ్డారు. జూన్ 28న సుల్తానాబాద్ బస్టాండ్ సమీపంలో ఓ హోటల్‌లో రూ.5 వేలు తీసుకుంటుండగా ఆర్ఐ వినోద్‌కుమార్, పొరుగుసేవల ఉద్యోగి(బిల్‌కలెక్టర్) విజయ్‌కుమార్‌ను పట్టుకున్నారు. కొత్త ఇంటికి నంబరు కేటాయించేందుకు రూ.10 వేలు డిమాండ్ చేశారు. చివరికి రూ.5 వేలకు అవగాహన కుదుర్చుకొని డబ్బులు ఇస్తుండగా అనిశాకు చిక్కారు.

**వీటిపై దృష్టి సారించాలి**

ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులపై నిరంతరం నిఘా ఉంచాలి ఆదాయానికి మించిన ఆస్తులు పెరుగుతుంటే వెంటనే తనిఖీలు చేపట్టాలి

ఉద్యోగంలో చేరే సమయంలో వారి ఆస్తులను నమోదు చేయాలి

వచ్చే వేతనాలు, వారు పెట్టే ఖర్చులను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

# అమృత్ భారత్ అర్ధంతర ప్రగతి

పెద్దపల్లి : పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ పనులు ఏడాదిన్నర కాలంగా 'అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి' అన్న చందాన మారాయి. రెండు సార్లు స్టేషన్ నమూనాను మార్చడంతో పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కొత్తగా నిర్మాణం కోసం పాత భవనం కూల్చివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూల్చివేతలతో రెండో ప్లాట్‌ఫాంపై శౌచాలయం కూడా లేకుండా పోయింది. స్టేషన్‌లో అర్ధంతరంగా నిలిచిన పనులతో ప్రయాణికులు రైలు ఎక్కే క్రమంలో ఇబ్బంది పడుతున్నారు. చివరికి టికెట్ బుకింగ్ కోసం నిర్మించిన తాత్కాలిక షెడ్డు నుంచి ప్లాట్‌ఫాం మీదకు వెళ్లేందుకు కవరింగ్ షెడ్లు, దీపాలు లేకపోవడంతో రాత్రి వేళలో, వర్షాలు కురిసిన సమయంలో అవస్థలు ఎదురవుతున్నాయి. స్టేషన్‌లో అమృత్‌భారత్ పనులను గత నెల రోజుల వ్యవధిలో సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం భరతేశ్‌కుమార్, జీఎం అరుణ్‌కుమార్



జైన్‌తో పాటు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పరిశీలించారు. అధికారులు, నేతలు పర్యటించినపుడు మినహా మిగతా సమయంలో పనులు ముందుకు సాగడం లేదు.

**పొరుగున వడివడిగా..**

గతేడాది ఫిబ్రవరి 26న పెద్దపల్లి, మంచిర్యాల స్టేషన్‌లలో అమృత్‌భారత్ పనులను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.26.49 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా, నత్తనడకన సాగుతుండటంతో అంచనా వ్యయం పెరగనుంది. సమీపంలోని మంచిర్యాల స్టేషన్‌లో 70 శాతం పనులు పూర్తి కాగా పెద్దపల్లిలో మాత్రం గుంతల తవ్వకం, భవనం కూల్చడం వరకే జరిగాయి. పెద్దపల్లి కంటే మూడు నెలల ముందు అమృత్ భారత్ పనులు చేపట్టిన కరీంనగర్ స్టేషన్‌లో పూర్తి కావడంతో గత నెలలో ప్రారంభించారు. రామగుండంలోనూ తుది దశకు చేరుకున్నాయి. పెద్దపల్లిలో మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. ఓవైపు బైపాస్ రైలు మార్గం సాంకేతిక లోపాలతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరోవైపు అమృత్ స్టేషన్ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రయాణికులు ఒంటికి, రెంటికి ఇబ్బందులు పడుతున్నారు.

**పర్యవేక్షణ లోపమే కారణం**

రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన అమృత్‌భారత్ పనుల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. పెద్దపల్లిలో ఏకకాలంలో చేపట్టిన వివిధ పనులు పనుల నిర్వహణను సంక్లిష్టంగా మార్చాయి. సరకు రవాణా ప్లాట్‌ఫాంలపై పూర్తి కవరింగ్ షెడ్లను నిర్మించే పనులు సాగుతుండగా మరోవైపు అమృత్‌భారత్ కోసం స్టేషన్ భవనం, ఇతర నిర్మాణాలు కూల్చివేశారు. గతేడాది నిర్మించిన నాలుగో ప్లాట్‌ఫాంను అసంపూర్తిగా వదిలేశారు. ఇక్కడే నిర్మించిన స్టేషన్ భవనాన్ని మాత్రం ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. వేర్వేరు సంస్థలు నిర్వహిస్తున్న పనులపై పర్యవేక్షణ లేకపోవడమూ నత్తనడకన సాగడానికి కారణం. పనులను కాజీపేటలోని ఇంజినీరింగ్ విభాగం సమీక్షించడంతో ఆలస్యమవుతున్నాయి. స్టేషన్‌తో పాటు ఆర్వోబీ, బైపాస్ పనుల నిర్వహణ దృష్ట్యా తాత్కాలికంగా పర్యవేక్షించడానికి పెద్దపల్లిలో కార్యాలయం ఏర్పాటు చేస్తే వేగవంతం కానున్నాయి.

# వైద్యం.. ప్రయాసే!

మెట్‌పల్లి : ప్రజలకు చేరువలోనే వైద్యం అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం, వాటి పరిధిలో ఉప కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తుంది. వాటిలో పలు రకాల వైద్యసేవలందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్య పర్యవేక్షణ, చిన్నారులకు టీకాలు తదితర విషయాల్లో పీహెచ్‌సీ పరిధిలో పనిచేసే వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఆరోగ్య కేంద్రాలకు సమాచారమిస్తుంటారు. ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో లేకుంటే దాని పరిధిలోని ప్రజలు, సిబ్బంది సైతం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటుంది. మెట్‌పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణ విషయంలో వ్యవహరిస్తున్న తీరు దాని పరిధిలోని ప్రజలు, సిబ్బందిని అవస్థలకు గురి చేసేలా ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. యుపీహెచ్‌సీ ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తోంది. సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరై చాలా రోజులు కావస్తున్నా భవన నిర్మాణానికి స్థలం కేటాయించక జాప్యం జరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణంలోని 12వ వార్డు అర్బన్ కాలనీలో రెవెన్యూ అధికారులు ఇటీవల స్థలం కేటాయించారు. ఇంత వరకు బాగానే ఉన్న అర్బన్ కాలనీ పట్టణానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడ భవనం నిర్మిస్తే వైద్య సేవల కోసం పట్టణ వాసులు అక్కడి వరకు వెళ్లాల్సి ఉంటుంది.

**పరిధి ఇక్కడ.. నిర్మాణం అక్కడ**

మెట్‌పల్లి పురపాలికలో 26 వార్డులుండగా, సగం వార్డులు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో, మిగతా సగం వార్డులు జగ్గాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో ఉన్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో 2, 4, 6, 7, 8, 9, 10, 15, 17, 19, 20, 21, 26వ వార్డుల్లో వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుతం యుపీహెచ్‌సీ నిర్మాణానికి కేటాయించిన స్థలం 12వ వార్డులో ఉండగా, అది జగ్గాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో ఉంది. దీంతో పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని వార్డుల్లో కాకుండా మరో పీహెచ్‌సీ పరిధిలోని వార్డులో భవనం నిర్మించనున్నారు. వాస్తవానికి ఏడాది కాలంగా యుపీహెచ్‌సీ భవనం కోసం పట్టణంలోని కొన్ని స్థలాలను పరిశీలించినా కొలిక్కి రాలేదు. చివరకు అర్బన్ కాలనీలో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. యుపీహెచ్‌సీ పరిధిలోని వార్డుల ప్రజలకు అందుబాటులో ఉండేలా సొంత భవనం నిర్మిస్తే వైద్య సేవలు చేరువయ్యే అవకాశముందని, ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈ నాగేశ్వర్‌రావును సంప్రదించగా, అర్బన్ కాలనీలో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారని, నిర్మాణ పనుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌ను సంప్రదించగా, పట్టణంలో కొన్ని స్థలాలు పరిశీలించినా సాధ్యపడలేదని, అర్బన్ కాలనీలో పది గుంటలు కేటాయించడం జరిగిందన్నారు.

# కా'సారం'.. పునరుజ్జీవం



హైదరాబాద్: భాగ్యనగరంలో చెరువులు జీవం పోసుకుంటున్నాయి. ఇప్పటికే ఆక్రమణల నుంచి విముక్తి పొందిన తటాకాలకు.. మురుగు నుంచి కూడా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. అన్నిటికంటే గొప్పగా కాసారాలు పాతకాలంలోని తమ నేలతో మమేకం అవుతున్నాయి. హద్దుల వరకు విస్తరిస్తున్నాయి. హైడ్రా చేపట్టిన ఆయా కార్యక్రమాలతో సత్ఫలితాలు చేకూరనున్నాయి.

**తమ్మిడికుంట విస్తీర్ణం రెట్టింపు..**

స్థానికుల ఫిర్యాదుతో మాదాపూర్‌లోని తమ్మిడికుంట ఆక్రమణలపై హైడ్రా విచారణ చేపట్టింది. కుంట వాస్తవ విస్తీర్ణం 29 ఎకరాల 24 గుంటలు. పూర్తిస్థాయి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో కలిపి 84 కట్టడాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అందులోని ఎకరం 12 గుంటల ఎఫ్‌టీఎల్, 2 ఎకరాల 18 గుంటల బఫర్‌జోన్‌లో ఎన్-కన్వెన్షన్ నిర్మాణాలు ఉన్నట్టు తేలింది. వాటిలోని వ్యాపార కార్యకలాపాలు జరుగుతోన్న నిర్మాణాలను ఆగస్టు 24న హైడ్రా నేలమట్టం చేసింది. జనాలు నివాసం ఉండే అపార్ట్‌మెంట్లను వదిలేసింది. అయినప్పటికీ.. 14 ఎకరాలకు కుంచించుకుపోయిన దాని విస్తీర్ణం 28 ఎకరాలకు పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఎకరా భూమిలో మీటరు లోతున గుంత తీస్తే 4 మిలియన్ లీటర్ల నీటిని నింపొచ్చు. దాని ప్రకారం ఆక్రమణల తొలగింపు ద్వారా సమకూరిన 14 ఎకరాల్లో సగటు మీటరు నుంచి రెండు మీటర్ల లోతున పూడిక తొలగింపు జరుగుతోంది. తద్వారా గతంతో పోలిస్తే తమ్మిడికుంటలో 22 కోట్ల లీటర్ల నీరు నిల్వ ఉండగలదని అధికారులు అంచనా వేస్తున్నారు. నల్లచెరువులోనూ ప్రగతి పనులు కొనసాగుతున్నాయి.

**అంతా మంచి నీరే..**

ప్రస్తుతం చెరువులోకి చేరుతోన్న మురుగును దారి మళ్లించేందుకు చుట్టూ కాలువ రాబోతుంది. వరద వచ్చినప్పుడు మాత్రమే తటాకంలోకి నీరు చేరేట్టు గుత్తేదారు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. వరదతో కలిసి వచ్చే మురుగు, వ్యర్థాలను వడపోసేందుకు ప్రత్యేకంగా కుంటను ఏర్పాటు చేస్తోంది. అందులో నీరంతా వడపోతకు గురై మధ్యలో ఉన్న తటాకాన్ని చేరుతోంది. తద్వారా.. దాంట్లో ఏడాది పొడవునా మంచి నీరు నిల్వ ఉంటుంది.

మంచినీటితో కళకళలాడే కాసారాలతో పర్యావరణానికి ప్రయోజనాలు చేకూరుతాయి. గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం 150 చెరువులు ఉన్నాయి.

**మరో ఐదు చోట్ల..**

కాటేదాన్‌లోని బమ్ రుఖ్ నుద్దౌలా చెరువులో 9 ఎకరాల విస్తీర్ణంలోని ఆక్రమణలను, సున్నం చెరువులో 5 ఎకరాల్లోని కబ్జాలను హైడ్రా తొలగించింది. కూకట్‌పల్లిలోని నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటలనూ హైడ్రా ఆక్రమణల నుంచి రక్షించింది. ఇప్పుడు వాటికి గత వైభవాన్ని తెచ్చేందుకు పూడికతీత చేపట్టింది. జూన్ ఆఖరు నాటికి రూ.100కోట్లతో 6 తటకాలను పూర్వస్థితికి తీసుకొస్తామని హైడ్రా స్పష్టం చేస్తోంది.

# ఇసుక తీస్తూ.. వాగును కబ్జా చేస్తూ..



వేములవాడ : కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మూలవాగును ఆక్రమిస్తున్నారు. వాగులోని ఇసుకను తోడేసి వ్యవసాయ క్షేత్రాల వెంబడి కట్ట పోసి ఆక్రమిస్తున్నా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**ఆందోళనకరంగా..**

వేములవాడ పట్టణంలోని మూలవాగు వంతెనకు ఇరువైపులా పట్టణ శివారు ఆనుకొని మూలవాగు ఉంటుంది. ఈ మూలవాగు ప్రతి వర్షాకాలంలో భారీ ఎత్తున పారి.. వరద నీరంతా మధ్యమానేరు జలాశయంలోకి చేరుతుంది. పట్టణానికి కొద్ది దూరంలో మహాలక్ష్మి వీధి ప్రాంతంలో కొన్ని రోజులుగా అ ప్రాంతంలోని రైతులు మూలవాగు బఫర్ జోన్‌నే కాకుండా ఏకంగా వాగును కబ్జా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాగులో భారీ యంత్రాలు పెట్టి ఇసుకను తీసి వాగులోనే వందల మీటర్ల పొడవు అడ్డుకట్ట వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. వాగు ఆక్రమణ కారణంగా తమకు నష్టం జరుగుతుందని వాగుకు అవతలి వైపు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**బఫర్ జోన్ ఆక్రమణ**

మూలవాగు వంతెనకు ఇరువైపుల బఫర్ జోన్ పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. పలువురు భవనాలు నిర్మాణం చేశారు. ఇదే వాగు వెంబడి మహాలక్ష్మి వీధిలో ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలోని మూలవాగు ఆక్రమణకు గురవుతోంది. వాగుకు ఇరువైపులా దాదాపు 9 మీటర్ల వెడల్పు బఫర్ జోన్ ఉంటుంది. ఇలాంటి స్థలాన్ని ఎవరు అక్రమించడానికి లేదు. అలాంటిది బఫర్ జోన్‌తో పాటు మూలవాగును సైతం ఆక్రమించి పెద్దఎత్తున కట్ట పోసే పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం లేదు. దీంతో ఆక్రమణలు విస్తరిస్తున్నాయి. ఇసుక అక్రమంగా తీసి కట్ట పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**నిబంధనలు తుంగలో తొక్కి..**

నిబంధనల ప్రకారం వాగులో ఇసుక, మట్టిని తీసేందుకు భారీ వాహనాలను వినియోగించరాదు. ఉయోగించాలంటే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండానే జేసీబీని ఏర్పాటు చేసి వందల మీటర్ల పొడవు మూలవాగులో భారీగా ఇసుకను తీసి కట్ట పోసి చదును చేయడం విమర్శలకు తావిస్తోంది. కట్ట కోసం మూలవాగులో వేల ట్రిప్పుల ఇసుక తీయడంతో చిన్నపాటి కుంటను తలపిస్తోంది. భారీగా ఇసుక తోడేయడంతో గుంతలతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది.

**పరిశీలించి చర్యలు** మూలవాగులో ఇసుక తీసి కట్ట పోసిన ప్రాంతాన్ని పరిశీలించి అందుకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం. యంత్రాలు పెట్టి తవ్వకాలు చేసేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. పూర్తి స్థాయిలో పరిశీలించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం.
శ్రీనివాస్, నీటిపారుదలశాఖ డీఈ, వేములవాడ

# నాణ్యతే ప్రామాణికం



గోదావరిఖని : వినియోగదారులకు మరింత నాణ్యమైన బొగ్గు విక్రయించేందుకు సింగరేణి ప్రయత్నిస్తోంది. నాణ్యత ప్రామాణికంగానే మార్కెట్ పెంచుకునే వీలు ఉండటంతో ఆ దిశగా సంస్థ ఆలోచన చేస్తోంది. సాధ్యమైనంత మేర క్వాలిటీ బొగ్గు సరఫరాకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే అనేక విధాలుగా వినియోగదారులకు నాణ్యతపై నమ్మకం కలిగిస్తూ.. కొత్త వారిని ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా మరిన్ని బొగ్గు శుద్ధి కేంద్రాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటోంది. గనుల్లో ఉత్పత్తి చేస్తున్న బొగ్గు నుంచి బండ, మట్టిని వేరుచేస్తారు. అనంతరం శుద్ధి కేంద్రాల్లో శుభ్రం చేసి సరఫరా చేస్తారు. దీంతో ధర ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

**తక్కువ గ్రేడ్ బొగ్గు**

సింగరేణి గనుల్లో చాలా వరకు తక్కువ గ్రేడు బొగ్గు ఉత్పత్తవుతోంది. జి-9 నుంచి జి-13 గ్రేడు బొగ్గు ఉంటుంది. ఆరు జిల్లాల పరిధిలోని గనుల్లో ఎక్కువ శాతం ఈ గ్రేడు బొగ్గు నిల్వలే ఉన్నాయి. కేవలం భూపాలపల్లి ప్రాంతంలో కొంత వరకు మాత్రమే కొద్ది వరకు నాణ్యమైన బొగ్గు నిల్వలున్నాయి. దీనివల్ల బొగ్గుకు రేటు తక్కువగా పలుకుతోంది. ఈ బొగ్గును పూర్తి స్థాయిలో శుభ్రం చేసి సరఫరా చేయడం ద్వారా కొంతవరకు నాణ్యత పెరిగి ధర వస్తోంది. ఇప్పటికే మణుగూరు, బెల్లంపల్లి రీజియన్, కొత్తగూడెం ప్రాంతాల్లో బొగ్గు శుద్ధి కేంద్రాలున్నాయి. రామగుండం ప్రాంతంలో ఉన్న కేంద్రం పలు కారణాల వల్ల ప్రస్తుతం నడవటం లేదు. తాజాగా సత్తుపల్లి ప్రాంతంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**కొత్త వినియోగదారులపై దృష్టి**

సింగరేణి ఎన్టీపీసీ, జెన్‌కోతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు విక్రయిస్తోంది. కొత్త వినియోగదారులను సమకూర్చుకోవడానికి దృష్టి పెట్టింది. ఈ మేరకు ఇటీవల నాణ్యత వారోత్సవాల సందర్భంగా ఉత్పత్తిలో నాణ్యత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని ఉద్యోగులకు సూచనలు చేసింది. రానున్న కాలంలో మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే నాణ్యత చర్యలు కీలకంగా మారాయి. దీంతో సింగరేణి ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.

# నీరు లేక.. గుండారం వెలవెల

కమాన్‌పూర్ : నాలుగు మండలాల వరప్రదాయిని, కల్పతరువు అయిన గుండారం జలాశయం అడుగంటింది. మొన్నటి వరకు నిండుకుండలా ఉండగా.. ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుంది. దీంతో జలాశయం ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతనెల రోజులకుపైగా నీటిని విడుదల చేస్తున్న ఎస్సారెస్పీ, రెవెన్యూ, ఇతర శాఖ అధికారులు 'మాములు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొన్నటివరకు రాత్రివేళలో నీటిని విడుదల చేయగా.. నేడు పగలు సైతం వదులుతున్నారు.

**అవసరం లేకున్నా విడుదల**

వేసవికాలంలో రామగిరి, మంథని, ముత్తారం మండలాల రైతుల పంట పొలాలకు విడతల వారీగా నీటిని కాపాడుకుంటూ సరఫరా చేసిన అధికారులు.. ప్రస్తుతం అవసరం లేకున్నా నిమ్మకు నీరెత్తినట్లు



వ్యవహరిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. జలాశయం నీటి మట్టం 12 అడుగులుకాగా.. ప్రస్తుతం పూర్తిగా అడుగంటిపోయింది. రుతుపవనాలు మురిపించి మొహం చాటేయడంతో.. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న నేపథ్యం జలాశయంలో నీరు లేకపోవడంతో సాగుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**చేపల వేటకే(నా)!**

ఈ ఏడాది వరుణుడు కరుణించకపోతే పరిస్థితి ఏంటనేదానిపై రైతులు కలవరపడుతున్నారు. ఇప్పటికైనా నీటి విడుదలకు అడ్డుకట్ట వేసి.. విడుదల చేసేవారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అయితే జలాశయాన్ని సుమారు రూ.70 లక్షలకు కొనుగోలు చేసినవారు.. చేపలు పట్టేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి నీరు ఉండగానే చేపలు పట్టాల్సి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు.

# లక్షలు వెచ్చించి.. వినియోగం మరిచి

సారంగాపూర్ : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఊరూరా డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్(కంపోస్టు) షెడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా 380 పంచాయతీలలో కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టగా తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున వ్యయం చేశారు. ఆరంభంలో కొన్ని పంచాయతీలు ఎరువు తయారు చేసినప్పటికీ వ్యయం అధికంగా ఉండడం, పంచాయతీలలో సిబ్బంది కొరతతో మానేశారు. కొద్ది రోజులు ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టడంతో తయారు చేసిన ఎరువును చూపించారు. కొన్నేళ్లుగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా మానేయడంతో రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి.

**సిబ్బంది లేక ఇబ్బంది**

గ్రామ జనాభా ప్రాతిపదికన పంచాయతీ కార్మికులను నియమించుకోవాల్సి ఉంటుంది. ఒక్కో పంచాయతీలలో ఒక్కరు, ఇద్దరు మినహా ఎక్కువగా నియమించుకునే అవకాశం లేదు. నియమించుకున్న ఒకరిద్దరు చెత్త ట్రాక్టర్ నడపడమే కాకుండా, నీటి సరఫరా, చెత్త సేకరణ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చే సమయం ఉండడంలేదు. అధికారులు ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చేందుకు అవకాశం కల్పిస్తే పంచాయతీలకు ఆదాయంతోపాటు లక్ష్యం నెరవేరనుంది.

**భారంగా చెత్త తరలింపు**



కొంత కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదల లేకపోవడంతో చెత్త తరలింపు భారంగా మారింది. ప్రభుత్వం అందించిన ట్రాక్టర్లకు కిస్తీలు చెల్లించలేని పరిస్థితి కొన్ని పంచాయతీల దైతే.. మరికొన్ని పంచాయతీలకు నిధులు లేక మరమ్మతు చేయించలేక మూలన పడేశారు. పంచాయతీల ట్రాక్టర్‌తోపాటు ఇతర పరికరాలు కూడా కొనుగోలు చేసి వినియోగించకుండా పక్కన పడేయడంతో ప్రజాధనం వృథా అవుతోంది. పంచాయతీలకు నిధులు మంజూరుచేసి సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

**కానరాని సేంద్రియ ఎరువు తయారీ**

గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఇంటింటికీ తడి, పొడి చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడి సెగ్రిగేషన్ షెడ్లలో ప్రత్యేకంగా నిర్మించిన చిన్న గదులలో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్, ఇతర వస్తువులు వేరు చేయాల్సి ఉంటుంది. తడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. ఎరువును గ్రామాల్లోని హరితహారం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వినియోగించాలి. మిగిలిన ఎరువును రైతులకు విక్రయించాలి. ఎక్కడ కూడా సేంద్రియ ఎరువు తయారీ చేపట్టడం లేదు.



# శ్రీశైలం ప్రాజెక్టులోకి పెరుగుతున్న వరద

కర్నూలు: శ్రీశైలం ప్రాజెక్టు కు వరద మరింత పెరుగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 1,98,550 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్‌ఫ్లో 59,239 క్యూసెక్కులుగా ఉంది. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315.. కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 23,924 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 880.40 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 190.33 టీఎంసీలకు చేరింది.



# వాగుపై కూలిన వంతెన..

సంతకవిటి: విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సాయన్న వాగుపై వంతెన కూలింది. ఆదివారం రాత్రి కొండగూడెం-ఖండ్యాం మధ్య వంతెన కూలడంతో.. రేగిడి, ఆమదాలవలస, బూర్జ మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి సమయంలో వంతెన కూలడంతో ప్రమాదం తప్పింది. ఖండ్యాంలో ఇసుక రీచ్‌కు వస్తున్న లారీల కారణంగానే వంతెన కూలిందని స్థానికులు చెబుతున్నారు.

# ఏపీలో ఎక్కడా లేని విధంగా ఆ ప్రాజెక్ట్ పూర్తి చేశాం: మంత్రి పయ్యావుల



అనంతపురం: ఏపీలో ఎక్కడా లేని విధంగా ఆరునెలల్లోనే తాగునీటి ప్రాజెక్ట్ పూర్తి చేశామని మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. ఇవాళ(సోమవారం) అనంతపురంలోని ఉరవకొండలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడారు. ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యని శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. ఉరవకొండ పట్టణానికి తాగునీరు అందించేందుకు జనవరి ఒకటోవ తేదీన తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించామని గుర్తుచేశారు మంత్రి పయ్యావుల కేశవ్. నేడు పనులు పూర్తి చేసి ప్రాజెక్ట్‌ని ప్రారంభించామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రూ.22కోట్లతో కేవలం ఆరునెలల్లోనే తాగునీటి ప్రాజెక్ట్ పూర్తిచేశామని తెలిపారు. ఆరోజే తాను చెప్పానని.. తనను గెలిపించిన ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని అన్నారు. ఈ రోజు ఏన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించానని చెప్పుకొచ్చారు. వైసీపీ నేత వై. విశ్వేశ్వర్ రెడ్డి ఒక అసమర్థుడని చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు.




# 2035 నాటికి ప్రపంచ క్వాంటమ్ కేంద్రంగా అమరావతి

అమరావతి: క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌ను ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. జూన్ 30న విజయవాడలో క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో చేసిన డిక్లరేషన్‌కు ఆమోదం లభించింది. ఈ మేరకు ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతిని క్వాంటమ్ గేట్ వే హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా "అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్"ను రూపొందించారు. క్వాంటమ్ పరిశోధన, ఆవిష్కరణ, అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే అతి పెద్ద క్వాంటమ్ బెడ్‌గా క్యూ-చిప్-ఇన్‌ను వచ్చే 12 నెలల్లో అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2035 నాటికి ప్రపంచ క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధే లక్ష్యమని ఉత్తర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది. 2026లో ప్రారంభమయ్యే అమరావతి క్వాంటమ్ అకాడమీ ద్వారా శిక్షణ, ఫెలోషిప్‌లు అందజేయాలని నిర్ణయించారు.

# వేగేశ్న ఆనందరాజు మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి



అమరావతి: రాజు వేగేశ్న ఫౌండేషన్ సంచాలకుడు వేగేశ్న ఆనందరాజు (67) మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫౌండేషన్ ద్వారా ఆయన అందించిన సేవలు మరవలేనివన్నారు. దేవాలయాల్లో మౌలికవసతుల కల్పనకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు. దేవాలయాల్లో అన్న ప్రసాద సత్రాలు, తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేశారని, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో మంచిపేరు తెచ్చుకున్నారని అన్నారు. ఆనందరాజు మృతి తీరని లోటని చెబుతూ.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలోని పెదవాల్తేర్ డాక్టర్స్ కాలనీలో ఆదివారం తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఫౌండేషన్ నిర్వహణలో ఆనందరాజు కీలకంగా వ్యవహరిస్తూ.. దాని ద్వారా దేశంలోని వివిధ ఆలయాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రూ.కోట్లు వెచ్చించారు. రూ.77 కోట్లతో తిరుమలలో అన్నదాన సత్రం, రూ.27 కోట్లతో నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణకు ఏటా రూ.1.50 కోట్లు ఇస్తున్నారు. శిర్డీలోనూ నీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. తిరుపతి, ద్వారకా తిరుమలలో ఆసుపత్రులు నిర్మించారు. ఆయన స్వస్థలమైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గణపవరంలో ఆరు ఎకరాల స్థలం కొనుగోలు చేసి.. పేదలకు ఇళ్ల స్థలాలు అందించారు.

# మోహన్‌బాబు పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

హైదరాబాద్: నటుడు మంచు మోహన్‌బాబు పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. విలేకరి రంజిత్‌పై దాడి చేసిన ఘటనలో మోహన్‌బాబుపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి పహాడిషరీఫ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని ఇటీవల మోహన్‌బాబు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు వినిపించడానికి పోలీసుల తరఫు న్యాయవాది సమయం కోరడంతో.. తదుపరి విచారణను హైకోర్టు 9వ తేదీకి వాయిదా వేసింది.




# మొబైల్ రీఛార్జ్‌లపై మళ్లీ మోత..!

## మొబైల్ రీఛార్జీలపై మళ్లీ మోత.. 10-12శాతం పెరిగే అవకాశం..!

దిల్లీ: గతేడాదిలో రీఛార్జ్ ప్లాన్ ధరలను భారీగా పెంచిన మొబైల్ నెట్‌వర్క్ కంపెనీలు మరోసారి పెంపునకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది చివరికి దేశీయ టెలికాం సంస్థలు మొబైల్ టారిఫ్‌లను 10-12 శాతం పెంచే అవకాశం ఉన్నట్లు ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్స్, మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రికార్డు స్థాయిలో యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు పెరగడం, 5జీ సదుపాయాల నేపథ్యంలో ఈ పెంపు ఉండొచ్చని చెబుతున్నారు. మే నెలలో దేశంలో మొబైల్ యాక్టివ్ యూజర్ల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. ఆ ఒక్క నెలలోనే 74 లక్షల మంది కొత్తగా సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నారు. 29 నెలల్లో ఇదే గరిష్ఠం కావడం గమనార్హం. దీంతో మొత్తం యాక్టివ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఏకంగా 108 కోట్లకు చేరువైంది. ఆ నెలలో రిలయన్స్ జియో లో కొత్తగా 55 లక్షల మంది చేరగా.. ఎయిర్‌టెల్‌కు 13 లక్షల మంది కొత్త యూజర్లు వచ్చారు. యూజర్ల సంఖ్య పెరగడంతో టారిఫ్‌ల పెంపుపై టెలికాం సంస్థలు దృష్టిసారించినట్లు ఆర్థికసేవల సంస్థ జెఫెరీస్ వెల్లడించింది. గతేడాది జులైలో బేస్ రీఛార్జ్ ప్లాన్‌ల ధరలు సగటున 11-23శాతం పెరిగిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది చివరికి మరో 10-12శాతం పెంచే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈసారి బేస్ ప్లాన్ల జోలికిపోకపోవచ్చని సమాచారం.

మధ్య, ఉన్నతశ్రేణి ప్లాన్లలపై ఛార్జీలు పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయి. అంతేగాక, డేటా వినియోగం, డేటా వేగం, డేటాను వినియోగించే నిర్దిష్ట సమయాల ఆధారంగా ఈ పెంపు ఉండొచ్చని తెలుస్తోంది. కొత్త రీఛార్జ్ ప్యాక్స్ డేటాలో భారీగా కోత పెట్టే అవకాశం కన్పిస్తోంది. డేటా ప్యాక్‌లను ప్రత్యేకంగా కొనుగోలు చేసేలా వీటిని రూపొందించనున్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మొబైల్ టారిఫ్‌లలో మార్పులు అవసరమని ఇప్పటికే ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్స్ అభిప్రాయం వ్యక్తంచేశారు. "ప్రస్తుత టారిఫ్‌లు యూజర్ అప్‌గ్రేడేషన్‌కు సరిపోవట్లేదు" అని ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విట్టల్ ఇటీవల ఓ సమావేశంలో పేర్కొన్నారు.



# ఐదేళ్లు కష్టపడ్డా.. పట్టుదలగా పనిచేసి గెలిచా..

నెల్లూరు: ఘన చరిత్ర ఉన్న వీఆర్ హైస్కూల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గాయకుడు ఎస్పీ బాలు వంటి వాళ్లు ఈ పాఠశాలలోనే చదివారని గుర్తు చేశారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వంటి వాళ్లు ఇదే పాఠశాల నుంచి వచ్చారన్నారు. మూతబడిన ఈ హైస్కూల్‌ను తిరిగి తెరిపించిన ఘనత మంత్రి నారాయణదే అన్నారు. నెల్లూరులో వీఆర్ మోడల్ పాఠశాలను లోకేశ్ ప్రారంభించారు. తరగతి గదులను, డిజిటల్ విద్యావిధానాన్ని, లైబ్రరీలో పుస్తకాలను లోకేశ్ పరిశీలించారు. ప్రతి తరగతి గదిలోని విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడా మైదానాన్ని పరిశీలించారు. విద్యార్థులతో క్రికెట్, వాలీబాల్ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా తీసుకొని పాఠశాల ప్రారంభానికి నారాయణ తీవ్రంగా కృషి చేశారన్నారు. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు పాఠశాలను తాను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. పట్టుదల, క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చన్నారు. సవాళ్లను స్వీకరించేందుకు అలవాటు పడాలని చెప్పారు. "గత ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఓడిపోయా.. కసిగా పనిచేశా. ఐదేళ్లు కష్టపడ్డా.. దాని ఫలితమే ఎప్పుడూ రాని మెజారిటీతో గెలిచా. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకునేటప్పుడు.. కష్టమైన శాఖ ఎందుకు తీసుకున్నారని చాలా మంది నన్ను అడిగారు. పవిత్రమైన బాధ్యతతో స్వీకరించిన పనిని ఇష్టంగా చేస్తున్నా. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నా. యూనిఫామ్‌లు, మౌలిక సదుపాయాలతో పాటు అన్నింటిని మెరుగుపరిచాం. ప్రపంచంతో పోటీపడేలా విద్యార్థులకు మెరుగైన సాంకేతికత అందిస్తున్నాం" అని లోకేశ్ తెలిపారు.

# ప్రతి హామీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సూపర్ సిక్స్ పథకాలు వేగంగా అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యలను కొంతమంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే పర్యటించిన ప్రతిచోట మహిళలు, వృద్ధులు ప్రస్తుత కూటమి పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు.





# సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో వైకాపా నేతల విచారణ.. హాజరైన పేర్ని నాని

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో వైకాపా నేతల విచారణ కొనసాగుతోంది. విచారణ నిమిత్తం మాజీ మంత్రి పేర్ని నాని హాజరయ్యారు. ఇప్పటికే ఆదివారం నరసరావుపేట, తెనాలి మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, సత్తెనపల్లి వైకాపా ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవ్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. ఇటీవల జగన్ రెంటపాళ్ల పర్యటనలో నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలో పలువురిపై కేసులు నమోదయ్యాయి.

# 'సుపరిపాలనలో తొలి అడుగు'.. గ్రామాల్లో పర్యటిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

నక్కపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దేవవరంలో హోం మంత్రి అనిత పర్యటించారు. రాబోయే నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు. విశాఖ జిల్లా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సింహాచలంలో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులకు, అన్ని పథకాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. తెనాలిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కడప జిల్లా లింగాల మండలంలో పర్యటించిన మంత్రి సవిత.. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా?అని ఆరా తీశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తామన్నారు. జమ్మలమడుగు మండలం గండికోట, కన్నెలూరులో మంత్రి బీసీ జనార్ధన్ పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయినా.. 'రీకాల్ చంద్రబాబు' కార్యక్రమం చేపట్టడం సిగ్గు చేటని విమర్శించారు. వైకాపా ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోయిందని ఎద్దేవా చేశారు.

# జీరో పావర్టీ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రి అనగాని

తిరుపతి: జీరో పావర్టీ దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అందుకోసం నియోజకవర్గాలు, జిల్లాలవారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని అధ్యక్షతన స్వర్ణాంధ్ర విజన్, పీ-4పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "విజన్ ప్లాన్ తయారీకి ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వ్యవసాయ, పరిశ్రమ, సేవారంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలి. తిరుపతి జిల్లాను మొదటిస్థానంలో నిలబెట్టాలి. బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకుంటాం" అని అన్నారు. 2018లో తెదేపా ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కూడా కిలోకు రూ.4 అదనంగా ఇచ్చి ఆదుకున్నామన్నారు.



# పాయల్ కిల్లింగ్ లుక్స్.. పిచ్చెక్కిపోవాలంతే..!

ఆరెక్స్ 100 బ్యూటీ పాయల్ రాజ్ పుత్ ఎందుకో కెరీర్ లో వెనకపడింది. మంగళవారం తర్వాత మళ్లీ తిరిగి ఫాంలోకి వస్తుందని భావించినా ఎందుకో అమ్మడు సరైన ఛాన్స్ లు అందుకోవట్లేదు. లాస్ట్ ఇయర్ రక్షణ అంటూ ఒక అటెంప్ట్ చేసింది కానీ అది కూడా వర్క్ అవుట్ కాలేదు. ఇక ప్రస్తుతం ఆది సాయి కుమార్ హీరోగా చేస్తున్న కిరాతక సినిమాలో నటిస్తుంది పాయల్. ఆ సినిమాతో పాటు తమిళ్ లో గోల్ మాల్, ఎంజల్ అనే రెండు సినిమాలు చేస్తుంది. అంతకుముందు పంజాబి, హిందీ, తెలుగు, ఒక కన్నడ సినిమా మాత్రమే చేసిన పాయల్ రాజ్ పుత్ ఇప్పుడు తమిళ పరిశ్రమకు ఎంట్రీ ఇస్తుంది. ఐతే పాయల్ సినిమాల కన్నా తన ఫోటో షూట్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని ఎప్పుడు నిరాశ చెంద నివ్వదు పాయల్. ఈ క్రమంలో తన ఫోటో షూట్స్ వారిని ఎంటర్టైన్ చేస్తాయి. లేటెస్ట్ గా పాయల్ గ్లామర్ షో చేస్తూ షేర్ చేసిన ఫోటో షూట్ ఆమె ఫాలోవర్స్



ని పిచ్చెక్కిపోయేలా చేసింది. బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ జాకెట్, డెనిమ్ షార్ట్ తో పాయల్ అందాల రచ్చ ఆడియన్స్ కి కనువిందు చేస్తుంది. అంతేకాదు ఆ గ్లామర్ షోకి తోడు అమ్మడి ఓర చూపులు మెంటల్ ఎక్కించేస్తున్నాయంటే నమ్మాల్సిందే. ఒక స్టార్ మెటీరియల్ అయిన పాయల్ రాజ్ పుత్ ఇలా కేవలం ఫోటో షూట్స్ కే అంకితం అవ్వడం ఇబ్బందిగానే అనిపించినా అమ్మడు మాత్రం తన కెరీర్, తన ఫ్యాన్స్ తో సంతృప్తి చెందుతుంది. పాయల్ రాజ్ పుత్ కి సినిమాల ఫలితాలు వాటి వల్ల వచ్చే ఛాన్స్ లు ఎలా ఉన్నా ఇలా ఫోటో షూట్స్ తోనే ఎక్కువ మైలేజ్ వస్తుంది. మరి అమ్మడు తిరిగి ఫాంలోకి రావాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా అవకాశాలు పెద్దగా రావట్లేదు. ఐతే పాయల్ ఫ్యాన్స్ మాత్రం తమకు ఇలా ఫోటో షూట్స్ చేసినా చాలని అంటున్నారు. పాయల్ లాంటి అందాల భామ ఇలా కెరీర్ లో వెనకపడం ఆమె ఫ్యాన్స్ ని కలవరపరిచేలా చేస్తుంది. ఐతే రానున్న సినిమాలతో అయినా పాయల్ కి సక్సెస్ వచ్చి తద్వారా మరిన్ని అవకాశాలు రావాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. మరి అది జరుగుతుందా లేదా అన్నది ఆ సినిమాలు వచ్చాక తెలుస్తుంది.

# బల్ల గుద్ది మరీ ఎగ్ దోశను ఎత్తేసింది!

కన్నడ బ్యూటీ వర్ష బొలమ్మ కు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. సక్సెస్ లతో పనిలేకుండా అమ్మడికి క్రేజ్ ఉంది. కోలీవుడ్ లో కెరీర్ ప్రారంభించిన అమ్మడిప్పుడు అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తోంది. దక్షిణాదిన అన్ని భాషల్ని టచ్ చేసింది. చూసి చూడంగానే చిత్రంతో లాంచ్ అయిన బ్యూటీ జాను మిడిల్ క్లాస్ మెలోడీస్ లాంటి చిత్రాలతో మరింత దగ్గరైంది. మీడియం బడ్జెట్ చిత్రాలతో నిర్మాతలకు అందుబాటులో ఉన్న నాయిక. తాజాగా రిలీజ్ అయిన తమ్ముడు లో కూడా నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది. కానీ వాటిని అందుకోవడంలో తమ్ముడు వేగం చూపించలే కపో తున్నాడు. ఆ సంగతి పక్కన బెడితే వర్ష మంచి ఫుడీ కూడా. రెండేళ్ల వయసులోనే మూడు గుడ్లు లాగిం చేసింది. ఎగ్ ప్యావరెట్. తాజాగా వర్ష ఎగ్ దోశను ఏ రేంజ్ లో ఆస్వాదించిందో తెలిస్తే చెఫ్ స్పెషలిస్ట్ కూడా వర్ష రేంజ్ లో ఎలివేషన్ ఇవ్వలేడేమో అనిపిస్తుంది. తమ్ముడు షూటింగ్ లో భాగంగా రంపచోడవరం రోడ్డు పక్కనే ఉన్న చిన్న హొటల్ లో యగ్ దశోను



మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనంటోంది. ఎగ్ దోశను వేసిన విధానం...కాల్చిన విధానాన్ని వర్ష భలే వివరించింది. ఆ రుచి గురించి చెబుతూ జీవితంలో ఇంతవరకూ అంత టేస్టీ ఎగ్ దోశ తినలేదంది. ఈ విషయాన్ని బల్ల గుద్ది మరీ చెప్పింది. దానికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అవుతుంది. ఎగ్ దోశె గురించి వర్ష చెబుతున్నప్పుడు ముఖంలో ఆ ఎక్స్ ప్రెషన్ చూస్తే ఆ దోశ టేస్ట్ ను అమ్మడు ఏ రేంజ్ లో ఆస్వాదించిందో అర్ధమవుతుంది. ఏది ఏమైనా మరోసారి తాను ఎగ్ ప్రియురాలని నిరూపించింది. ఆ ఎగ్ దోశ చేసింది ఓ కూడా ఓ ఆంటీ అని తెలిపింది. ఆవిడెవరో తెలిస్తే కుమారీ అంటీ వైరల్ అయినట్లు అవ్వడం ఖాయం. ఈ మధ్య కాలంలో ఫుడ్ వీడియోలు ఎక్కువగా వైరల్ అవుతోన్న సంగతి తెలిసిందే.




# సుహాస్ 'ఓ భామ అయ్యో రామ'.. బ్యూటిఫుల్ ట్రైలర్ చూశారా?



విభిన్నమైన, వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకోవడంలో పేరుగాంచిన యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో సుహాస్.. ఇప్పుడు కొత్త రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ ఓ భామ అయ్యో రామ మూవీతో ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మాలీవుడ్ మూవీ జో లో తన రోల్ తో క్రేజ్ సంపాదించుకున్న మాళవిక మనోజ్.. సుహాస్ సరసన నటిస్తున్నారు. ఓ భామ అయ్యో రామ మూవీతోనే టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలోకి వస్తున్నారు. రామ్ గోధల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను వీ ఆర్ట్స్ బ్యానర్ పై హరీష్ నల్ల నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకులు మారుతి, హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నారు. స్పిరిట్ మీడియా బ్యానర్ పై రానా దగ్గుబాటి.. సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసిన మేకర్స్.. ప్రస్తుతం ప్రమోషన్స్ చేపడుతున్నారు. వరుసగా అప్డేట్స్ ఇస్తున్నారు. ఆడియన్స్ ను మంచి రెస్పాన్స్ అందుకుంటున్నారు. తాజాగా థియేట్రికల్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ట్రైలర్.. అందరినీ ఆకట్టుకుని సందడి చేస్తోంది. ట్రైలర్ బట్టి.. ఓ భామ అయ్యో రామ క్యూట్ అండ్ ఎంటర్టైనింగ్ లవ్ స్టోరీలా సినిమా ఉండనున్నట్లు అర్థమవుతుంది. ఎంటర్టైన్మెంట్ తోపాటు ఎమోషన్, హీరో, హీరోయిన్స్ ఎనర్జీ.. అలా ప్రజెంట్ జెనరేషన్ ఆడియన్స్ తోపాటు అన్ని వర్గాల సినిమాను అలరించనున్నట్లు ఓ భామ అయ్యో రామ రూపొందిస్తున్నారని తెలుస్తుంది. ముఖ్యంగా ట్రైలర్ లో ప్రతి ఫ్రేమ్ కలర్ ఫుల్ గా ఉందని చెప్పాలి. హీరోహీరోయిన్ల మధ్య సీన్స్ బాగున్నాయి. సుహాస్ ఎనర్జిటిక్ గా కనిపిస్తున్నారు. రామ్ గోధల సినిమా కోసం బాగా కష్ట పడినట్లు తెలుస్తోంది. ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా ఉన్నాయి. ఓవరాల్ గా ట్రైలర్.. మూవీపై అంచనాలు పెంచు తోంది. అయితే ట్రైలర్ రిలీజ్ తర్వాత నిర్మాత హరీష్ మాట్లాడారు. ట్రైలర్ విడుదలైన కొన్ని గంటలకే మంచి స్పందన వచ్చిందని, చాలామంది సినిమా విజయం సాధిస్తారని అంచనా వేస్తున్నారని తెలిపారు. రొమాంటిక్ ఎంటర్టైనర్ లోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నిమగ్నం చేసేలా రూపొందించామని చెప్పారు. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కు అద్భుతమైన సానుకూల స్పందన వచ్చిందని దర్శకుడు రామ్ పేర్కొన్నారు. నిర్మాణంలో ఏ దశలోనూ నాణ్యత విషయంలో రాజీ పడలేదని నిర్మాతను ప్రశంసించారు. హరీష్ మద్దతు వల్లే తాము ఇంత నాణ్యమైన ఉత్పత్తిని నిర్మించగలిగామని తెలిపారు. మరి ఎలాంటి హిట్ సాధిస్తారో వేచి చూడాలి.

# 'కూలీ' పోస్టర్.. అలా అంటున్నారేంటి?




కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ లో రూపొందుతున్న కూలీ మూవీ రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్ గా రెడీ అవుతున్న ఆ సినిమా.. ఆగస్టు 14వ తేదీన వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. పాన్ ఇండియా రేంజ్ లో సందడి చేయనుంది. అయితే కూలీ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ లో సందడి చేయనున్నారు. టాలీవుడ్ కింగ్ నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయనతోపాటు ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్ యాక్ట్ చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కూడా నటిస్తున్నారు. అమీర్ నటిస్తున్న విషయాన్ని అనౌన్స్ చేస్తూ.. మేకర్స్ రీసెంట్ గా పోస్టర్ రిలీజ్ చేశారు. ఆ సమయంలో ఐమ్యాక్స్ లోనూ రిలీజ్ చేస్తామని పోస్టర్ లో మెన్షన్ చేశారు. ఇప్పుడు ఆ విషయమే చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే.. ఐమ్యాక్స్ ఫార్మాట్ లో కూలీ మూవీ విడుదల అవ్వడానికి ఇంకా డీల్ ఫిక్స్ అవ్వలేదట. ఎందుకంటే ఇప్పటికే బాలీవుడ్ మూవీ వార్-2 మేకర్స్ తోపాటు ఐమ్యాక్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సినిమా కూడా ఆగస్టు 14వ తేదీన రిలీజ్ కానుంది. దీంతో వేరే సినిమా ఆ రోజు ఐమ్యాక్స్ ఫార్మాట్ లో విడుదల అయ్యే అవకాశం లేదు. అయినప్పటికీ.. పోస్టర్ లో కూలీ మేకర్స్ ఐమ్యాక్స్ లోగోను వేశారు. ఇప్పుడు ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఐమ్యాక్స్ బ్రాండింగ్ నియమాలకు కూలీ మూవీ పోస్టర్ విరుద్ధంగా ఉందని కామెంట్లు పెడుతున్నారు. ఇటువంటి చర్యలు.. పరిశ్రమ పద్ధతుల పట్ల గౌరవం గురించి ప్రశ్నలను లేవనెత్తుతాయని అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఐమ్యాక్స్ తో చర్చలు జరుపుతున్నా.. లోగో ఉపయోగించకూడదని అంటున్నారు. ఒప్పందం కుదరకుండా లోగో వేస్తే ప్రేక్షకులను తప్పుదారి పట్టించినట్లు అవుతుందని చెబుతున్నారు. ఏదేమైనా మార్గదర్శకాలకు కట్టుబడి ఉండటం ప్రాధాన్యమని అంటున్నారు. ముఖ్యంగా ఐమ్యాక్స్ వంటి విషయాల్లో కరెక్ట్ గా ఉండాలని సూచిస్తున్నారు. ఏదేమైనా ఐమ్యాక్స్ ఇష్యూ విషయంలో కూలీ మేకర్స్ కే అసలు విషయం తెలియాలి.

# వెంకీ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన ఇస్మార్ట్ బ్యూటీ?

ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం మూవీతో బ్లాక్ బస్టర్ ను అందుకున్న వెంకటేష్ తన తర్వాతి సినిమాల విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంక్రాంతి వస్తున్నాం సినిమాతో వచ్చిన సక్సెస్ ను కాపాడుకోవాలని ఏ కథ పడితే అది కాకుండా మంచి స్క్రిప్ట్ తో సినిమా చేయాలని చూస్తున్నారు విక్టరీ వెంకటేష్. వెంకీ తన తర్వాతి సినిమాను ఎవరితో చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ ఓ సినిమాను చేయబోతున్నట్టు ఇప్పటికే వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. వీరి కాంబినేషన్ లో రానున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనైతే రాలేదు కానీ ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన



వర్క్స్ వేగంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే త్రివిక్రమ్ సినిమాకు కథను లాక్ చేసి ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తి చేశారని అంటున్నారు. ఈ సినిమాకు వెంకట రమణ కేరాఫ్ ఆనంద నిలయం అనే టైటిల్ ను అనుకుంటున్నారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో వెంకీ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలకు త్రివిక్రమ్ రైటర్ గా పని చేయగా ఆ రెండు సినిమాలూ మంచి హిట్లుగా నిలిచాయి. కానీ త్రివిక్రమ్ డైరెక్టర్ గా మారాక మాత్రం వీరిద్దరూ కలిసి పని చేసింది లేదు. ఇన్నేళ్లకు వీరిద్దరి కాంబోలో సినిమా రానుండటంతో ఈ కాంబినేషన్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ ఫిల్మ్ న్యూస్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. వెంకీ- త్రివిక్రమ్ కాంబినేషన్ లో రానున్న సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటించనుండగా, అందులో ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఒక హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు సమాచారం. త్వరలో సినిమాను మొదలుపెట్టి 2026 సమ్మర్ కు రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. వెంకీ కెరీర్లో 77వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఎప్పుడొచ్చినా ఆడియన్స్ అంచనాలకు తగ్గట్టే ఉంటుందని భావిస్తున్నారు. కాగా నిధి అగర్వాల్ ప్రస్తుతం హరి హర వీరమల్లు, ది రాజా సాబ్ సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే.

# ఉర్ఫీ జావెద్‌ని టాలీవుడ్ కి తెస్తున్నారా?

ఉర్ఫీ జావెద్ పరిచయం అవసరంలేని పేరు. బాలీవుడ్ లో సినిమాలు చేయలేదు. కానీ సోషల్ మీడియాలో ఎంతో ఫేమస్ . బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ని మించిన ఫాలోయింగ్ ఉర్ఫీ సొంతం అనడంలో ఎలాంటి సందేహం లేదు. వింతైన డిజైనర్ దుస్తుల్లో అందాల ప్రదర్శనలో తానో సంచలనం. డిజైనర్ దుస్తుల్లో రొడ్డెక్కిందంటే? అక్కడ ట్రాఫిక్ జామ్ అవ్వాల్సిందే. ఇన్ స్టా హీటెక్కాల్సిందే. డ్యాష్ అండ్ డేరింగ్ గాళ్. తనదారికి అడ్డొస్తే సెలబ్రిటీలనే ఎదురిస్తుంది. నువ్వెంత అంటే నువ్వెంత అంటుంది. ఇలాంటి వివాదాలు అమ్మడి పేరిట చాలానే ఉన్నాయి. శిల్పా శెట్టి భర్త రాజ్ కుంద్రా తో కూడా తగాదాకి దిగిన సంగతి తెలిసిందే. ఇలా ఇంత ఫేమస్ అయినా అమ్మడికి బాలీవుడ్ లో మాత్రం ఇప్పటికీ అవకాశాలు రాలేదు. కొన్ని టీవీ షోలు..వెబ్ సిరీస్ లు చేసింది. సినిమా ఛాన్సలు మాత్రం రాలేదు. ఈ నేపథ్యంలో ఉర్ఫీ ని టాలీవుడ్ కి తీసుకొచ్చే బాధ్యతను ఓ దర్శక,



నిర్మాత తీసుకున్నాడుట. ఉర్ఫీని హీరోయిన్ గా పెట్టి సినిమా తీస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచనతో ముంబై వైపు మళ్లినట్లు సమాచారం. ఆ దర్శక, నిర్మాత వెనుక మరో దర్శకుడి హస్తం కూడా ఉందిట. సోషల్ మీడియాలో ఉర్ఫీ ఫాలోయింగ్ చూసే ఈ ఛాన్స్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరి ఉర్ఫీని ఎలాంటి పాత్రలో చూపిస్తారో చూడాలి. ఉర్ఫీ కూడా అందాల ప్రదర్శనకు ఏమాత్రం వెనకడుగు వేయదు. ఆఫ్ ది స్క్రీన్ లో నే చిచ్చర పిడుగులా చెలరేగిన బ్యూటీ ఆన్ ది స్క్రీన్ పై ఆగుతుందా? ఆ దర్శక , నిర్మాతలిద్దరు కూడా హీరోయి న్లను అందంగా చూపించడంలో ఎక్స్ పర్ట్ లే. గతంలో కొన్ని బోల్డ్ అటెంప్ట్ లు చేసిన అనుభవం కూడా ఉంది. ఉర్ఫీ ఇమేజ్ కూడా ఈ నయా డైరెక్టర్లకు బాగానే వర్కౌట్ అవుతుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో? తేలాలి. అలాగే ఈ అవకాశం నిజమే అయితే? ఉర్ఫీ జావెద్ రియాక్షన్ ఎలా ఉంటుంది? అన్నది అంతే ఆసక్తికరం.




సంగారెడ్డి: పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఆచూకీ లభించని కార్మికులు ఏమయ్యారో తెలియని పరిస్థితి. రెస్క్యూ బృందాలు కర్మాగారంలో భవనాల శిథిలాల తొలగింపు వేగవంతం చేసినా ఫలితం దక్కడం లేదు. దీంతో తమ వారి కోసం కార్మికుల కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. ప్రమాదం జరిగి 8 రోజులవుతున్నా.. రాహుల్, రవి, వెంకటేశ్, ఇర్ఫాన్, విజయ్, అఖిలేశ్, జస్టిన్, శివాజీల ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో ఐలా సెంటర్ వద్ద తమ వారి కోసం కుటుంబ సభ్యులు పడిగాపులు కాస్తున్నారు. చివరి చూపైనా దక్కుతుందేమోనని ఆశతో వారు రోజు ఇక్కడికి వస్తున్నారు. గల్లంతైన ఎనిమిది మంది విషయంలో డీఎన్ఏ రిపోర్టులు కీలకంగా మారనున్నాయి. 70కి పైగా నమూనాలను డీఎన్ఏ రిపోర్టుల కోసం అధికారులు పంపారు. మరోవైపు మంగళవారం పాశమైలారం సిగాచీ పరిశ్రమకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ బృందం రానుంది. ఘటనా స్థలాన్ని %చీణహీూ% బృందం పరిశీలించనుంది. పరిశ్రమలో పేలుడుకు గల కారణాలపై ఎస్‌డీఎంఏతో కలిసి అధ్యయనం చేయనుంది. ప్రమాదానికి గల కారణాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇవ్వనుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచనలు చేయనుంది.

## క్రీడాపోటీల నిర్వహణకు అవకాశమివ్వండి.. కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో పర్యటిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయతో భేటీ అయ్యారు. తెలంగాణలో జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల నిర్వహణకు అవకాశం ఇవ్వాలని కోరారు. 'ఖేలో ఇండియా', '40వ జాతీయ క్రీడలు' నిర్వహణకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఖేలో ఇండియా' కింద శిక్షణ, వసతుల అభివృద్ధికి నిధులివ్వాలి. జాతీయ క్రీడల్లో పాల్గొనేవారికి రైలు ఛార్జీల్లో రాయితీ పునరుద్ధరించాలి"అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తమకు సవాల్ అని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బలమైన ప్రతిపక్షం ఉంటే ఉపఎన్నికల్లో అధికార పార్టీ గెలవదన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలపై భాజపా ఫోకస్ చేయలేదని చెప్పారు. ఈసారి దృష్టి సారిస్తామని.. 25 రోజుల్లో పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ కూర్పుపై ముఖ్య నేతలతో చర్చిస్తామని చెప్పారు.

అందులో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. భాజపాలో వర్గాలేమీ లేవని.. అందరం పార్టీ లైన్‌లో కలిసికట్టుగా వెళ్తామని వివరించారు.

## వాళ్ల వద్ద అన్ని అస్త్రాలు అయిపోయాయి: ఆది శ్రీనివాస్



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన దెబ్బకు భారత రాష్ట్ర సమితి తెలంగాణ సెంటిమెంట్ అస్త్రాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితిని విమర్శిస్తే తెలంగాణను విమర్శించినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో బిహార్ తరహా సంస్కృతిని తీసుకువస్తున్నారని ఆక్షేపించారు.

భారత రాష్ట్ర సమితి నేతల ఆటలు సాగవన్నారు. భారత రాష్ట్ర సమితి వద్ద ఉన్న అన్ని అస్త్రాలు అయిపోయాయని అందుకే తెలంగాణ సెంటిమెంట్‌ను ముందుకు తెచ్చారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకరని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో చర్చకు రమ్మని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ చేస్తే కేటీఆర్ పారిపోయారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు.. పరిపాలన కుంటుపడింది: హరీశ్‌రావు



హైదరాబాద్: ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, పరిపాలన కుంటుపడిందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తీరును విమర్శించారు. పంచాయతీ ఎన్నికలు వచ్చాయని రైతుబంధు వేస్తున్నారని చెప్పారు. రైతుబంధును నాట్లు.. నాట్లకు మధ్య కేసీఆర్ ఇస్తే.. రేవంత్‌రెడ్డి ఓట్లు ఓట్లకు మధ్య ఇస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో ఎరువులు, యూరియా లభించట్లేదన్నారు. ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి అమలు చేయట్లేదని విమర్శలు గుప్పించారు.




దమ్మపేట: అశ్వరావుపేట, దమ్మపేట మండలాల సరిహద్దు గ్రామమైన అచ్యుతాపురం సమీపంలోని ఓ ఆయిల్ పామ్ తోటలో సోమవారం ఉదయం భారీగా గంజాయి ప్యాకెట్లను పట్టుకున్నారు. ఆయిల్‌పామ్ తోటను ఆనుకొని ఉన్న పంట కాలువలో గుర్తుతెలియని వ్యక్తి 44 ప్యాకెట్ల గంజాయిని దాచి ఉంచాడు. ఆదివారం రాత్రి భారీగా వర్షం కురవడంతో.. కాలువలో ప్యాకెట్లు పైకి తేలాయి. ఉదయాన్నే తోటలోకి వచ్చిన యజమాని పంట కాలువలో ప్యాకెట్లను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అశ్వరావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ప్యాకెట్లు అక్కడికి ఎలా వచ్చాయి? ఎవరు తీసుకువచ్చారు అనే అంశాలపై విచారణ సాగిస్తున్నారు. వీటి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు.




రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే గుడ్‌న్యూస్ చెప్పింది. కాచిగూడ-యశ్వంత్‌పుర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కోచ్‌ల సంఖ్యను పెంచుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ రైళ్లు(20703, 20704) ప్రస్తుతం ఎనిమిది కోచ్‌లతో నడుస్తుండగా.. బోగీలను రెట్టింపు (16) చేస్తున్నట్లు తెలిపింది. దీంతో ఇకపై 14 చైర్‌కార్, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో కాచిగూడ-యశ్వంత్‌పుర్-కాచిగూడ మధ్య వందేభారత్ రైళ్లు సర్వీసులందించనున్నాయి. ఈ నిర్ణయం జులై 10వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఇప్పటివరకు ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యం 530గా ఉండగా.. తాజాగా 1128కి పెరిగింది.

**వందేభారత్‌కు తప్పిన ప్రమాదం...** 2023 సెప్టెంబర్ 28న ప్రధాని నరేంద్ర మోదీ కాచిగూడ-యశ్వంత్‌పుర్-కాచిగూడ రైలును వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఈ రైలును ఎనిమిది కోచ్‌లతో 530 మంది సిటింగ్ సామర్థ్యంతో సర్వీసులందిస్తోంది. తాజాగా బోగీలను రెట్టింపు చేయడంతో 14 చైర్‌కార్ బోగీల్లో 1024మందిబీ రెండు ఎగ్జిక్యూటివ్ కోచ్‌లలో 104మంది చొప్పున మొత్తంగా 1128మంది ప్రయాణికులు ఒకేసారి ప్రయాణించేందుకు వెసులుబాటు కలగనుంది.




కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలో చిన్నారి హితీక్ష (5) హత్య కేసులో మిస్టరీ వీడింది. ఆమెను చిన్నమ్మ మమత చంపినట్లు పోలీసులు నిర్ధరించారు. తోడికోడలిపై కోపంతోనే ఐదేళ్ల చిన్నారి గొంతు కోసి ప్రాణాలు తీసినట్లు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని బాత్రూమ్‌లో పడేసినట్లు గుర్తించారు. నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కోరుట్లలోని స్థానిక ఆదర్శనగర్ కాలనీలో ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కొద్దిసేపటి తర్వాత సమీపంలోని ఓ ఇంటి స్నానాల గదిలో విగతజీవిగా కనిపించడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. మొదట ఆ ఇంటి యజమానిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అతడికి ఫోన్ చేయగా తాను వరంగల్ జిల్లాలో ఉన్నట్లు చెప్పారు. స్థానికంగా ఉన్న వారే హత్యకు పాల్పడి ఉండచ్చన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. శనివారం రాత్రి 11 గంటలకు ఎస్పీ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వేకువజామున 4 గంటల వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. మృతురాలి ఇంటి వద్ద ఉన్న ఓ సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు జరిపారు. జాగిలాలు ఘటనా స్థలం నుంచి చిన్నమ్మ ఇంటికే వెళ్లి ఆగాయి. ఆ దిశగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు చిన్నారిని ఆమె చిన్నమ్మే హత్య చేసినట్లు నిర్ధరించారు.




తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు జూన్ 8, 9 తేదీల్లో నిర్వహించిన ఈ పరీక్షకు సంబంధించి ఇటీవల కీ విడుదల చేసిన అధికారులు.. తాజాగా ఫలితాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్ ఎంటర్ చేసి తాము సాధించిన మార్కులు, ర్యాంక్‌లను తెలుసుకోవచ్చు. తెలంగాణ ఐసెట్ పరీక్షకు మొత్తంగా 71,746 మంది దరఖాస్తు చేయగా.. 64,938మంది హాజరయ్యారు. వీరిలో 58,985మంది (90.83శాతం) అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. క్వాలిఫై అయిన వారిలో 30,989 మంది అమ్మాయిలు ఉండగా.. 27,998 మంది అబ్బాయిలు ఉన్నారు.




## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివి అన్నీ అబద్ధాలే: కేటీఆర్

హైదరాబాద్, జులై 07: సీఎం రేవంత్ రెడ్డి అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారని.. అవి చేయ లేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలకు చెందిన పలు పార్టీల నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి కోతలు సరిపోవని.. కర్రు కాల్చి వాతలు పెట్టాలన్నారు. ఆ విధంగా మీరందరూ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గతంలో చాలా మంది ముఖ్యమంత్రులను చూశామని.. కానీ ఇలాంటి ముఖ్యమంత్రిని తాను చూడలేదంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిది నోరా లేకుంటే మోరీనా అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. రుణ మాఫీ లేదు.. రైతు బంధు లేదంటూ రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. అందుకే వందనా నీ బొందనా అని తాను స్పందించానని కేటీఆర్ చెప్పారు. ఇది కోతల ప్రభుత్వమంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అభివర్ణించారు. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఆ కుర్చీలో కూర్చున్నారంటేనే.. అందుకు కేసీఆరే కారణమన్నారు. కేసీఆర్, టీఆర్ఎస్ లేకపోతే.. గులాబీ జెండా ఎగరకుంటే.. తెలంగాణ వస్తుండేనా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ విషయం రేవంత్ రెడ్డికి తెలియదా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు తాము సైతం అధికారంలో ఉన్నామన్నారు. కానీ తాము ఈ విధంగా ఎగిరెగిరి పడలేదన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో అరాచకాలను ఈ సందర్భంగా కేటీఆర్ వివరించారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com